ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnol,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 01 సంచిక -271 పేజీలు - 08 వెల - 06/- గురువారం 2 జనవరి 2025

# కూటమి ప్రభుత్వంతో భవిష్యత్‌పై భరోసా



- తప్పుచేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
- 2024 చరిత్ర తిరగరాసిన సంవత్సరం
- అమరావతితో సినిమా రంగానికి మంచిరోజులు
- మీడియా ఇష్టాగోష్టిలో సీఎం చంద్రబాబు

అమరావతి,జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) : ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉంది. ప్రజల ఆలోచనలు, అవసరాల మేరకు పాలనా విధానాలను మార్చుకుంటున్నాం. అధికారులు కూడా ప్రజల ఆకాంక్షల మేరకు పనితీరు మార్చుకోవాలని సిఎం చంద్రబాబు అన్నారు. 2024.. చరిత్ర తిరగరాసిన సంవత్సరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్ల ప్రజలు పడిన ఇబ్బందులకు విముక్తి కలిగిందని, ఇదే సమయంలో మీడియా కూడా ఇబ్బంది పడిందన్నారు. మిగతాది 2లో...

## 2025లో కేంద్ర కేబినెట్ తొలి సమావేశం...

### రైతుల కోసం కీలక నిర్ణయాలు!

**2025 తొలి కేబినెట్ భేటీని ప్రధాని మోదీ రైతులకు అంకితం చేశారన్న కేంద్రమంత్రి**

**ఫసల్ బీమా యోజనకు కేటాయింపులను రూ.69 వేల కోట్లకు పెంచుతూ కేబినెట్ ఆమోదం**

**డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350కే రైతుకు అందించే పథకం పొడిగింపుకు ఆమోదం**




కేంద్ర కేబినెట్ బుధవారం నాడు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2025లో తొలి కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ప్రధాని నరేంద్రమోదీ రైతులకు అంకితం చేశారని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రైతుల సంక్షేమం గురించి ప్రధానంగా ఈ కేబినెట్ సమావేశంలో చర్చ జరిగిందన్నారు.పంటల బీమా పథకమైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను మరింతగా మెరుగుపరచాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు. ఫసల్ బీమా యోజనకు కేటాయింపులను రూ.69,515 కోట్లకు పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. అలాగే 50 కిలోల డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350 చొప్పున రైతులకు అందించేందుకు రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగిస్తున్నట్లు కేంద్రమంత్రి వివరించారు.కేంద్ర కేబినెట్ నిర్ణయాలపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేస్తూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామన్నారు. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే రైతన్నను చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు. 2025లో జరిగిన తొలి కేబినెట్ సమావేశాన్ని రైతుల శ్రేయస్సు కోసమే అంకితం చేశామని తెలిపారు. రైతుల విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

## నేటి నుంచి మూడు రోజుల పాటు వాలంటీర్ల నిరసన

**ఉద్యోగ భద్రత కల్పించాలని వాలంటీర్ల డిమాండ్**

**రేపు గ్రామ, వార్డు సచివాలయం అడ్మిన్ లకు వినతి పత్రాల అందజేత**

**ఎల్లుండి మోకాళ్ల మీద కూర్చొన భిక్షాటన కార్యక్రమం చేపట్టనున్న వాలంటీర్లు**



2లో

## ఆరు నెలల్లో నేను చేసింది ఇదీ..

**లిస్టు విడుదల చేసిన పవన్ కళ్యాణ్**

జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) : నూతన సంవత్సరం సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ ఆరున్నర నెలల కాలంలో పిఠాపురం ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గ అభివృద్ధికి ఏమేం చేశాననే వివరాలను పవన్ కళ్యాణ్ వెల్లడించారు. సమగ్ర అభివృద్ధి నివేదిక - 2024 పేరుతో.. ఈ ఆరున్నర నెలల కాలంలో పిఠాపురం ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పర్యావరణ, అటవీ, సైన్స్‌అండ్ టెక్నాలజీ శాఖా మంత్రిగా చేసిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.పిఠాపురం ఎమ్మెల్యేగా పిఠాపురం సమగ్రాభివృద్ధి కోసం పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. అలాగే పిఠాపురం నియోజకవర్గ ప్రజల అవసరాన్ని గుర్తించి ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని.. మిగతాది 2లో...




## విచారణకు హాజరైన పేర్ని జయసుధ



రేషన్ బియ్యం మాయం కేసులో ఏ1గా పేర్ని జయసుధ

తన న్యాయవాదులతో కలిసి పీఎస్ కు వచ్చిన పేర్ని నాని అర్ధాంగి

2లో

## దావోస్ సదస్సుకు సీఎం చంద్రబాబు, నారా లోకేశ్

**దావోస్ లో జనవరి 20 నుంచి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు**

**ఈ నెల 19న దావోస్ బయల్దేరనున్న చంద్రబాబు బృందం**

**'షేపింగ్ ద ఇంటెలిజెంట్ ఏజ్' థీమ్ తో దావోస్ లో ఏపీ బృందం ప్రదర్శన**



అమరావతి,జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) : స్విట్జర్లాండ్ లోని దావోస్ లో ప్రతి ఏడాది ప్రపంచ ఆర్థిక వాణిజ్య సదస్సు నిర్వహిస్తుండడం తెలిసిందే. 2025లో జనవరి 20 నుంచి 24 వరకు దావోస్ సదస్సు జరగనుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ఏపీ సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ఈ సదస్సులో పాల్గొననున్నారు. మిగతాది 2లో...

## ప్రకాశం జిల్లా ఎస్పీకి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు లేఖ






2లో

నాడు రఘురామ గుండెలపై కూర్చుని హింసించిన వ్యక్తి

ఆ వ్యక్తిని తులసిబాబుగా గుర్తించిన పోలీసులు

విచారణ సమయంలో తాను వచ్చి తులసిబాబును గుర్తిస్తానన్న రఘురామ

## ఎవరెవరు ప్రజలకు దగ్గరగా ఉన్నారో వివరాలు ఉన్నాయి

### : ప్రజాప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సూచనలు

కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళదామన్న సీఎం

స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రజలకు చేరువ కావాలని సూచన



2లో

# నాని అనుచరుడు కాళీకి పది వరకు రిమాండ్

## వైద్య పరీక్షల అనంతరం నెల్లూరు జైలుకు తరలింపు

గుడివాడజనవరి 1( రిపబ్లిక్ న్యూస్) :



మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, కృష్ణా జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీకి న్యాయస్థానం రిమాండ్ విధించింది. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం పోలీసులు ఆయన్ను గుడివాడ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ఈ నెల 10 వరకు కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. ఆ తర్వాత నిందితుడు కాళీని పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. వైకాపా అధికారంలో ఉండగా గుడివాడ తెదేపా కార్యాలయం, ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావుపై దాడి కేసులో కాళీ కీలక సూత్రధారి. 2022 డిసెంబరు 25న రాత్రి.. కాళీ తన అనుచరులతో కలిసి తెదేపా కార్యాలయం, రావిపై పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేశాడు. ఈ సంఘటనపై రావి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా నాటి అధికార పార్టీ ప్రోద్బలంతో నిందితులను అరెస్టు చేయలేదు. పైగా రావి వర్గీయులు, ఇతర తెదేపా నాయకులపై ఎదురు కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంఘటన వీడియోలను పోలీసులు పరిశీలించి హత్యాయత్నం సెక్షన్‌ను జోడించారు. ఈ క్రమంలో డిసెంబరు 4న పది మంది నిందితులను ఏకకాలంలో అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ముఖ్య నిందితుడైన కాళీ.. అస్సాం రాష్ట్రంలో చేపల వ్యాపారం చేస్తున్నాడని గుర్తించి పక్కా ప్రణాళికతో మంగళవారం అదుపులోకి తీసుకుని గుడివాడకు తీసుకొచ్చారు. నేడు వైద్యపరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

## దావోస్ సదస్సుకు సీఎం చంద్రబాబు, నారా లోకేశ్

ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ సంస్థలకు వివరించేందుకు దావోస్ వేదికను ఉపయోగించుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇందుకోసం 'షేపింగ్ ద ఇంటెలిజెంట్ ఏజ్' థీమ్ తో ఏపీ బృందం దావోస్ లో ప్రదర్శన ఏర్పాటు చేయనుంది. దావోస్ పర్యటన కోసం చంద్రబాబు బృందం ఈ నెల 19న రాష్ట్రం నుంచి బయల్దేరనుంది. సీఎం వెంట పరిశ్రమలు, ఏపీ ఆర్థికాభివృద్ధి బోర్డు అధికారులు కూడా దావోస్ పర్యటనకు వెళ్లనున్నారు.

ఈ సదస్సులో పాల్గొనే దిగ్గజ పారిశ్రామిక సంస్థలకు ఏపీలో అందుబాటులో ఉన్న వనరులు, పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ వివరించనున్నారు. ఏపీలో టెక్నికల్ అడ్మినిస్ట్రేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ తదితర అంశాలపై వివరించనున్నారు. రాష్ట్రంలో స్మార్ట్ సిటీలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులకు పరిచయం చేయనున్నారు.

# కూటమి ప్రభుత్వంతో భవిష్యత్‌పై భరోసా

(మొదటి పేజి తరువాయి)



కూటమి ప్రభుత్వం వచ్చాక అందరికీ భవిష్యత్తుపై భరోసా వచ్చిందని పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చంద్రబాబు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కొందరు అధికారులు జగన్ మాటలు విని పనిచేశారని పేర్కొన్నారు. జగన్.. చివరకు అధికారులను కూడా గత ఐదేళ్లు బురద గుంతలో తోసేశారని విమర్శించారు.' ఎమ్మెల్యేలకు దశలవారీగా కౌన్సిలింగ్ ఇస్తున్నా. తప్పుడు పనులు చేయొద్దని వారిని పదేపదే హెచ్చరిస్తున్నా. సమాజానికి హానికరమైన వారిని మాత్రం వదిలేది లేదు. గతంలో రౌడీయిజం, మతకలహాలను అణచివేసినట్లే ఇప్పుడూ చేస్తాను. కొన్ని అంశాల్లో పార్టీ శ్రేణులు, నా అభిప్రాయాల్లో తేడా ఉంటోంది. కొందరు కార్యకర్తలు తమ అజెండాను నేను అమలు చేయాలని అనుకుంటున్నారు. జగన్ మాదిరిగా మేమూ తప్పులు చేస్తే ఎలా.. ప్రజలన్నీ గమనిస్తూనే ఉంటారు. నాకు నా ప్రజలే హైకమాండ్. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదు. గత విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నాం అన్నారు. కొత్త సంవత్సరం ప్రారంభంతోనే.. ప్రత్యర్థులకు సరికొత్త వార్నింగ్ ఇచ్చారు. ఇక ఆట మొదలైందని.. ఎవరినీ వదిలిపెట్టబోనని స్పష్టమైన ప్రకటన చేశారు. బుధవారం నాడు మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు.. తాను జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే కొంతమందికి మిసరబుల్ ట్రీట్‌మెంట్ ఉంటుందని అన్నానని గుర్తు చేశారు. ఆ మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. అయితే, తాను రాజకీయ కక్ష తీర్చుకోబోనని.. తప్పు చేసిన వారిని మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

1995 సీఎంను త్వరలో మీరే చూస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఇక గేమ్ స్టార్ట్ అయ్యింది. సోషల్ మీడియా వ్యవహారంలో మీరు చూశారు కదా. మిగతా కేసులు కూడా అలానే డీల్ చేస్తాను. కేడర్ ఉద్దేశ్యం ఒకలాగా ఉంది. నా లక్ష్యం వేరుగా ఉంది. ఎందుకంటే.. నేను అందరి అభిప్రాయాలు తీసుకోవలి. అవతలి వాళ్లు చేసినట్లు నేను చేయను. చట్టం, న్యాయం ప్రకారం చేస్తాను. నేను ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదు.' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మా కేడర్, నాయకులు లేదా అధికారులు ఎవరు తప్పు చేసినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. ఇప్పటికే ఎమ్మెల్యేలను పిలిచి అందరితో మాట్లాడుతున్నాను. అందరినీ కరెక్ట్ చేస్తాను. అలాగే కలిసి ముందుకు వెళ్తాను. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ గెలిచేలా ఉండాలి. 2004 లో నన్ను ఎవరూ ఓడించలేరు. హైదరాబాద్‌ను ఎన్నడూ లేని విధంగా డెవలప్ చేశాను. కానీ, ప్రజలకు ఈ విషయాన్ని కమ్యూనికేట్ చేయలేకపోయాను. ఇప్పుడు ప్రజలకు చెప్పి మనం ముందుకు తీసుకెళ్లాలి.' సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. గతంలో మా పార్టీ నేతలను హతమార్చారు. జగన్ హయాంలో మా పార్టీ వాళ్ళు బాగా ఇబ్బంది పడ్డారు. అందరినీ మేము చాలావరకు సర్దుబాటు చేస్తున్నాము. అందరికీ పదవులు ఇవ్వలేం కదా. ఈ సారి జాగ్రత్తగా ఉన్నాము. అందరు అభిప్రాయాలు తీసుకుంటాను. నేను సభ్యత్వం, పదవులు పంపిణీ మీద అన్ని క్రాస్ చెక్ చేసుకుంటున్నాను. నా ఓన్ మెకానిజమ్ నాకు ఉంది. అందుకే ప్రతి విషయం క్రాస్ చేసుకుంటున్నాను. గంతలోలా నేను లేను. అన్ని విషయాలు నేను చూసుకుంటున్నాను.' అని సీఎం చంద్రబాబు తెలిపారు.దీపం, నాలుగు వేలు పెన్షన్ పథకాలను అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. 'కేంద్ర ప్రభుత్వానికి కూడా లిమిటేషన్స్ ఉంటాయి కదా. నేను ప్రజలను అభినందిస్తున్నాను. వాళ్లు ఇచ్చే సహకారం నేను మరువను. వాళ్లకు జరిగే దానిపై సంతృప్తి ఉంది. భవిష్యత్‌పై ఆశ ఉంది. వాళ్ల హోప్స్‌కి మేము రీచ్ కావాలి.' అని ముఖ్యమంత్రి తెలిపారు.

# ఆరు నెలల్లో నేను చేసింది ఇదీ..

(మొదటి పేజి తరువాయి)

అందుకు అవసరైన సిబ్బంది, మౌలిక సదుపాయాల కోసం రూ. 39.75 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. అలాగే సామాన్యులకు అందుబాటులో ఉండేలా, శ్రీవారి ఆశీస్సులతో తక్కువ ఖర్చుతో పెళ్ళిళ్ళు జరిపించేందుకు వీలుగా రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో టీటీడీ కళ్యాణ మండపం మంజూరు చేసినట్లు తెలిపారు.గొల్లప్రోలులో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పైప్ లైన్, మోటార్ల మరమ్మత్తుల కోసం రూ. 72 లక్షల విలువైన పనులు చేపట్టామని.. విధ్యార్థులకు చదువుతో పాటుగా, క్రీడలలో ఆసక్తి పెంచేందుకు నియోజకవర్గంలోని 32 పాఠశాలలకు క్రీడా సామాగ్రి కిట్లను సీఎస్ఆర్ నిధులతో అందించామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేలా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కోసం సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక జనరల్ డ్యూటీ అటెండర్‌ను నియమించినట్లు వెల్లడించారు. అలాగే నూతన ఎక్స్ రే యూనిట్ ఏర్పాటు చేశామని.. పిఠాపురం %=.=.దీ.ఎ.=% కళాశాలలో ఆర్వో ప్లాంట్ మరమ్మత్తులు చేయించి తాగునీటి సౌకర్యం కల్పించినట్లు వివరించారు.ఇక ఎన్నో ఏళ్లుగా పెద్ద సమస్యగా మారిన గొల్లప్రోలు డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేలా చర్యలు మొదలు పెట్టామని పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. తాత్కాలికంగా 1.5 ఎకరాల పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను 0.25 ఎకరాకు కుదించి చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రపరిచామన్నారు. అలాగే గొల్లప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేదారిలో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గొల్లప్రోలు ప్రాథమికోన్నత పాఠశాల కోసం రూ. 4 లక్షల సీఎస్ఆర్ నిధులతో పైప్ లైన్ ద్వారా నూతన %=. ా% ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. గొల్లప్రోలు ఎంపీపీ పాఠశాలలో 1.75 లక్షల సీఎస్ఆర్ నిధులతో పెండింగ్ పనులు పూర్తిచేశామని.. చేబ్రోలు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో రూ. 2 లక్షల %జూ=% నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు పవన్ కళ్యాణ్ వివరించారు.ప్రభుత్వ పారదర్శకత, జవాబుదారీతనంలో భాగంగా గత ఆరున్నర నెలల కాలంలో జరిగిన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల వివరాలు తెలియజేశానన్న డిప్యూటీ సీఎం.. భవిష్యత్తులో కూడా మీ ప్రేమ, మద్దతు ఇలాగే ఉండాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

# నేటి నుంచి మూడు రోజుల పాటు వాలంటీర్ల నిరసన

అమరావతి,జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) :



వాలంటీర్లకు న్యాయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వాలంటీర్లు మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలను చేపట్టబోతున్నారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ నిరసన చేపట్టనున్నట్టు స్టేట్ వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా జనవరి 2వ తేదీన గ్రామ, వార్డు సచివాలయం అడ్మిన్ లకు వాలంటీర్లు వినతి పత్రాలను అందజేయనున్నారు. 3వ తేదీన జిల్లా కేంద్రాల్లో మోకాళ్ల మీద కూర్చొని భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బ్యాక్ వాక్ చేస్తున్నారని గుర్తు చేస్తూ 4వ తేదీన బ్యాక్ టు వాక్ పేరుతో వాలంటీర్లు వెనుకకు నడుస్తూ నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఈశ్వరయ్య తెలిపారు.

## విచారణకు హాజరైన పేర్ని జయసుధ

గుడివాడ జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) :

తమ సొంత గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయమైన కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని భార్య పేర్ని జయసుధ పోలీసు విచారణకు హాజరయ్యారు. విచారణకు హాజరు కావాలంటూ. ఈ కేసులో ఏ1గా ఉన్న జయసుధకు నిన్న పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ మధ్యాహ్నం (జనవరి 1 మధ్యాహ్నం 2 గంటలకు) విచారణకు హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమె మచిలీపట్నం పీఎస్ లో విచారణకు హాజరయ్యారు. మచిలీపట్నం మేయర్ కారులో తన న్యాయవాదులతో కలిసి ఆమె పీఎస్ కు వెళ్లారు. ఆర్ పేట సీఐ ఏసుబాబు ఆమెను విచారించారు. దాదాపు 2 గంటల సేపు విచాణ కొనసాగింది. విచారణకు ఆమె తరపు న్యాయవాదులను పోలీసులు అనుమతించ లేదు.గోడౌన్ లో స్టాక్ తగ్గడానికి గల కారణాలేమిటి? బియ్యం గోడౌన్ నుంచి బయటకు ఎలా వెళ్లింది? అని జయసుధను పోలీసులు ప్రశ్నించారు. వేయింగ్ మిషన్ల వల్లే స్టాక్ లో తేడా వచ్చిందని... తాము బాధ్యతగా రూ. 1.70 కోట్ల జరిమానాను చెల్లించామని జయసుధ తెలిపారు. అయితే... ఎంవోయూ ప్రకారం స్టాక్ లో తేడా వస్తే జరిమానా విధించడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఉందని పోలీసులు తెలిపారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో అపశృతి.. ఒకరి మృతి

అమరావతి,జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) :పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ సంతోషంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకున్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం నెలకొంది. విశాఖపట్నం గాజువాక పట్టణంలో వడ్లపూడి రజకవీధిలో నిన్న రాత్రి న్యూ ఇయర్ సెలబ్రెషన్స్‌లో భాగంగా క్రాకర్ కాలుస్తుండగా ఒక్కసారిగా పేలి,సుద్దమళ్ల శివ అనే వ్యక్తి నుదుడిపై తీవ్రగాయమై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే కూర్మన్నపాలెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు బోరున రోధించారు. బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రకాశం జిల్లా ఎస్పీకి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు లేఖ

అమరావతి,జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) :

ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ దర్యాప్తు అధికారిగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ కేసులో కామేపల్లి తులసిబాబు అనే వ్యక్తికి పోలీసులు నోటీసులు పంపారు. విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు.

ఈ క్రమంలో, రఘురామకృష్ణరాజు నేడు ఎస్పీ దామోదర్ కు లేఖ రాశారు. విచారణ సమయంలో తులసిబాబును గుర్తించేందుకు తాను హాజరవుతానని రఘురామ తన లేఖలో పేర్కొన్నారు.

తులసిబాబు ఎవరంటే...

గత ప్రభుత్వ హయాంలో, రఘురామను రాజద్రోహం నేరం కింద అరెస్ట్ చేసి, చిత్రహింసలు పెట్టడం సంచలనం సృష్టించింది. సీఐడీ కార్యాలయంలో ముసుగు వేసుకుని వచ్చిన కొందరు వ్యక్తులు ఆయనపై దాడి చేశారు. రఘురామ గుండెలపై కూర్చున్నది బయటి వ్యక్తి అని, అతడిని తులసిబాబు అనే వ్యక్తిగా గుర్తించిన పోలీసులు అతడికి నోటీసులు పంపారు. తులసిబాబుది గుడివాడ అని తెలుస్తోంది. అరెస్ట్ చేసేనాటికి రఘురామ గుండెకు స్టెంట్ వేసి ఉన్నారు. దాంతో, తన గుండెలపై ఓ వ్యక్తి కూర్చోవడంతో బాధతో విలవిల్లాడిపోయానని రఘురామ పలు సందర్భాల్లో చెప్పారు.

తులసిబాబు... ఈ కేసులో నిందితుడిగా ఉన్న రిటైర్డ్ సీఐడీ అదనపు ఎస్పీ విజయపాల్ కు సన్నిహితుడిగా భావిస్తున్నారు. ఇటీవల పోలీసులు విజయపాల్ ను అరెస్ట్ చేసి విచారించారు. విచారణ సమయంలో విజయలపాల్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే తులసిబాబుకు నోటీసులు పంపినట్టు తెలుస్తోంది.

## ఎవరెవరు ప్రజలకు దగ్గరగా ఉన్నారో వివరాలు ఉన్నాయి

### : ప్రజాప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి



ఎవరెవరు ప్రజలకు దగ్గరగా ఉన్నారో తన వద్ద వివరాలు ఉన్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసేందుకు వచ్చి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఆయన దిశా నిర్దేశనం చేశారు. వారితో కాసేపు ప్రభుత్వం, పార్టీ గురించి మాట్లాడారు.

ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంపై ఆయన సూచనలు చేశారు. కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళదామన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు దగ్గరగా ఉండాలన్నారు. ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రజలకు చేరువ కావాలన్నారు. ఈరోజు నుంచి ప్రజాప్రతినిధులతో మాట్లాడతానని... ఎవరెవరు ప్రజలకు దగ్గరగా ఉన్నారో తెలుసన్నారు.

## దుర్గమ్మ దయతో కొత్త సంవత్సరంలో ప్రజలకు మేలు జరగాలి : చంద్రబాబు

అమరావతి,జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) :



నూతన సంవత్సరంలో ఆ దుర్గమ్మ తల్లి దయతో అందరికీ మేలు జరగాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. చంద్రబాబు నాయుడు బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయానికి వచ్చిన సీఎంకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ 2025 నూతన క్యాలెండర్‌ను, డైరీని అందజేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో రాష్ట్రానికి మేలు జరుగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. సీఎం రాక సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం వెంట హోం మంత్రి వంగలపుడి అనిత తదితరులున్నారు. నూతన సంవత్సరం తొలిరోజు ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు వివరించారు.

# పాలకులు ఆత్మ విమర్శ చేసుకోవాలి !

దేశంతో పాటు ప్రపంచమంతా కొత్త సంవత్సరంలోకి అడుగిడిన వేళ..ప్రజలంతా కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని కోరుకుంటున్న వేళ..రాజకీయ నాయకులు, పాలకులు కూడా అదే ఆశయాలతో ముందుకు సాగితే దేశం పురోగమిస్తుంది. కానీ రాజకీయ నాయకులు ఎల్లవేళలా ఓటుబ్యాంకు దృష్టిలోనే ఆలోచనలు చేస్తున్నారు. అదే కోణంలో పథకాలు గానీ, పనులుగానీ చేస్తున్నారు. దీంతో దేశం ముందుకు సాగడం లేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం,రూపాయి పతనం వంటి సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవే. వాటిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం లేదు. ధరల అదుపునకు చర్యలు లేవు. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా..రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. కొనుగోలుదారులు మాత్రం అధికధరలతో అవస్థలు పడుతున్నారు. ఇకపోతే 140కోట్ల మంది భారతీయులు ఉన్న మన దేశంలో కూలీల కొరతను ఎదుర్కొంటున్నాం. వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. దీనికతంటికి పాలకుల విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులను చేసి, పనులకు దూరం చేస్తున్నారు. ఈ సమస్యలపై చర్చించి ముందుకు సాగాలన్న బలమైన సంకల్పం పాలకుల్లో కొరవడింది. ఐదేళ్లు గడిచేలోగా..మరో ఐదేళ్లకు వేసుకునే ప్రణాళికలతో పాలకులు సాగుతున్నారు. సమిష్టి కృషితో దేశాన్ని ముందుకు నడిపిస్తు న్నామని ప్రధాని మోడీ నూతన సంవత్సరానికి ముందు ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలా అయితే భారతదేశం పురోగమించదని, ప్రజలు సమస్యలు, అప్పులు, పన్నుల భారం నుంచి బయటపడరని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇకపోతే భాగస్వామ్య పక్షాలుగా ఉన్నా టిడిపి,జనసేన తదితర పార్టీలు కూడా చొరవ తీసుకుని మంచి సలహాలు కూడా ఇవ్వలేక పోతున్నాయి. పెన్షన్లు 4వేలకు పెంచి పంచడమే గొప్ప ఘన కార్యాంగా ఎపి సిఎం చంద్రబాబు భావిస్తున్నారు. మంత్రులు, పార్టీ పెద్దల సలహాలు తీసుకుని పాటించే ఆనవాయితీ మోడీకి ఎలాగూ లేదు. కనీసం భాగస్వామ్య పక్షాలతో అయినా చర్చించే పరిస్థితి లేదు. ఇకపోతే గతేడాది అనేక ముఖ్య ఘట్టాలను మనం పరిశీలించవచ్చు. దేశ రాజకీయాలకు సంబంధించినంత వరకు 2024 ఒక చారిత్రక ఘట్టంగా భావించాలి. కొడిగట్టి పోతున్న కాంగ్రెస్‌కు నూనె పోసి దీపం వెలిగించిన ఘనత మోడీదే. మోడీ నిరంకుశ విధానాలతో కాంగ్రెస్ మళ్లీ బతికి బట్టకట్టింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగడం ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాం. కానీ అయోధ్యలోనే బిజెపి పతనం చెందింది. కారణమేమంటే అక్కడి స్థానికులకు లబ్ది కలిగేలా, వారికి దారి చూపేలా పథకాలు అమలు కాలేదు. అయితే గత సంవత్సరం భారతీయ జనతా పార్టీకి




సంబంధించి అత్యంత కీలకమైనదిగానే చెప్పుకోవాలి. రామమందిర నిర్మాణం జరిగిన వెంటనే మోదీ ఎన్నికలకు వెళ్లి ఉంటే ఏమి జరిగేదో కాని, ఆయన ఉన్నట్లుండి వ్యూహం మార్చి పూర్తిగా మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దేశమంతటా మోదీ అనే వ్యక్తి ఆధారంగానే బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తన పేరు చెబితే దేశం దేశం ఏకమై ఉవ్వెత్తున జనం ముందుకు వచ్చి ఓటు వేస్తారని ఊహించుకున్న మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాని ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కాకపోవడంతో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితమయింది. ఇదో రకంగా మోడీకి శరాఘాతంగా భావించాలి. ఈ విఘాతాన్ని అధిగమించాలంటే హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తప్పదని మోదీ గ్రహించారు. అందుకే అన్నిశక్తులూ ఒడ్డి, అన్ని రకాల వ్యూహాలు పన్ని ఈ రెండు రాష్టాల్లో బీజేపీ గెలుపొందేలా చేయడంతో దేశ రాజకీయ చిత్రపటంపై తనకు తిరుగులేదని అనిపించుకున్నారు. ఎన్నికల్లో గెలవడం తెలుసుకున్న మోడీ ప్రజల మనసులను మాత్రం గెలవలేకపోతున్నారు. ఆయన అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజలనునరకయాతన పెడుతున్నా సమీక్షించుకోవడం లేదు. ఈ క్రమంలో 2025 ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీకి సంబంధించి కీలక సంవత్సరంగా భావించాలి. మారుతున్న ప్రపంచ రాజకీయాల నేపథ్యంలో భారత్‌లో కూడా మార్పులు రావాల్సి ఉంది. రాజ్యాంగం, కులగణన, అదానీ కుంభకోణం వంటి అంశాలను లేవనెత్తుతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం కూడా అంత సులభం కాదు. పార్లమెంట్ చర్చలకు వేదిక కాకుండా కుమ్ములాటలకు రంగస్థలం కావడంపై ప్రతిపక్షాల కంటే మోదీయే జవాబుదారీ కావల్సి ఉంటుంది. మోడీ ఇంతవరకు గట్టిగా నిలబడి ఏదేని సమస్యపై చర్చించిన దాఖలాలు లేవు. పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం లేకుండా పోతున్నది. 2024లో దేశంలో దాదాపు పది సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం, ఈ ప్రభుత్వంలో తెలుగుదేశం వంటి దక్షిణాది పార్టీ ప్రధాన భాగస్వామి కావడం, ప్రధాన రాజకీయ పార్టీలు రెండు ప్రధాన కూటములుగా ఏర్పడడం మరో ముఖ్యమైన పరిణామం అని చెప్పక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు చెందని ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షను ఎదుర్కొంటున్నాయి. బీఆర్ఎస్, బీజేడి, వైసీపీ, ఆమ్ఆద్మీ పార్టీలు మనుగడకోసం కష్టపడు తున్నాయి. 2025 ఈ విషయంలో మరింత స్పష్టత నిస్తుందనడంలో సందేహం లేదు. అయితే మోడీ తన ఆర్థిక విధానాలను, పాలనా తీరును సమీక్షించుకోక తప్పదు. లేకుంటే మోడీ అస్తిత్వం కూడా ప్రశ్నార్థకం కాగలదు. దేశానికి దిశదశ చూపేలా రాజకీయాలు చేయాలి. ప్రజల బాటలో నడవాలి. అప్పుడే మోడీ నిలుస్తారు.

# న్యూ ఇయర్ వేడుకల్లో భారీగా ఆన్‌లైన్ బిజినెస్

**భారీగా ఆర్డర్ చేసిన కండోమ్స్..లో దుస్తులు - ఫుడ్‌కు యధావిధిగానే పెరిగిన డిమాండ్**

న్యూఢిల్లీ,,జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) : భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారత్‌లో ఏ వస్తువుల ఎక్కువగా ఆర్డర్ చేశారో తెలుసుకోవాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది. కొందరు ఫుడ్ ఆర్డరిస్తే, కొందరు డ్రింక్స్ పెడుతుంటారు. డిసెంబర్ 31న భారతీయులు ఎక్కువగా ఆర్డర్ చేసిన ఐటమ్స వివరాలను ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజాలు బ్లింకిట్, స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ షేర్ చేశాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అత్యంత ప్రజాదరణ పొందిన వస్తువుల వివరాలను నెటిజన్లతో షేర్ చేసుకున్నారు. ఊహించినట్లగానే కొత్త సంవత్సరంలో పార్టీలు బాగా జరిగాయి. దేశవ్యాప్తంగా ప్రజలు స్నాక్స్ ఎక్కువ బుక్ చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్‌లో 2.3 లక్షల ఆలూ భుజియా ప్యాకెట్లు డెలివరీ అయ్యాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సైతం గత రాత్రి 7.30 గంటలకే నిమిషానికి 853 చిప్స్ ఆర్డర్‌లు వచ్చాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లో అత్యధిక బుకింగ్స్



పాలు, చిప్స్,చాక్లెట్, ద్రాక్ష, పన్నీర్ ఐటమ్స్ ఉన్నాయని వెల్లడించింది. కూల్ డ్రింక్స్, ఐస్ క్యూబ్స్ కూడా భారీగా ఆర్డర్ చేశారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్ ద్వారా డెలివరీ 6,834 ఐస్ క్యూబ్స్ ప్యాకెట్లు, అదే సమయానికి బిగ్ బాస్కెట్‌లో ఐస్ క్యూబ్‌ల ఆర్డర్‌లు 1290 శాతం పెరిగాయి. 7:41 గంటల సమయంలో 119 కిలోలు ఐస్ క్యూబ్స్ డెలివరీ అయ్యాయని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. బిగ్‌బాస్కెట్‌లో నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్ విక్రయాలు 552 శాతం పెరిగాయి. డిస్పోజబుల్ కప్పులు, ప్లేట్‌ల ఆర్డర్స్ సైతం 325 శాతం పెరిగాయి. సోడా, మాక్‌టెయిల్ విక్రయాలు సైతం 200 శాతం పెరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా అత్యధిక విక్రయాలు జరిగిన మరో ఐటమ్ కండోమ్స్. డిసెంబర్ 31 మధ్యాహ్నం వరకే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 4,779 ప్యాక్‌ల కండోమ్స్ డెలివరీ చేసింది. సాయంత్రం తరువాత నిరోధ్‌ల విక్రయాలు మరింత పెరిగాయి. బ్లింకిట్‌లో సైతం కండోమ్ అమ్మకాలు భారీగా పెరిగాయి. 1.2 లక్షల కండోమ్‌ల ప్యాకెట్లు డెలివరీ చేశామని వెల్లడించారు. లో దుస్తులు సైతం కొందరు ఆర్డర్ పెట్టడం విశేషం.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కస్టమర్ కళ్లకు గంతలు కట్టి, చేతికి సంకెళ్లు కావాలని ఆర్డర్ చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. వీటితో పాటు గతంలో ఎన్నడూ లేనంతగా కూల్ డ్రింక్స్, చిప్స్ విక్రయాలు పెరిగాయంటే ఎక్కువగా ఇంట్లో కుటుంబసభ్యులతో న్యూ ఇయర్ జరుపుకున్నారని ఈకామర్స్ దిగ్గజాలు చెబుతున్నారు.

# లక్నోలో దారుణం

**తల్లితో నలుగురు చెల్లెళ్లను హత్య చేసిన యువకుడు**



లక్నో, :ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణం జరిగింది. ఓ హెూటల్‌లో తన తల్లితో పాటు నలుగురు చెల్లెళ్లను హత్య చేశాడు ఓ యువకుడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెంట్రల్ లక్నో డిప్యూటీ కమిషనర్ రవీణ త్యాగి తెలిపిన వివరాల ప్రకారం.. రాజధాని లక్నోలోని శరణ్‌జిత్ హెూటల్‌లో ఓ యువకుడు తన తల్లి, నలుగురు చెల్లెళ్లతో దిగాడు. తల్లి, చెల్లెళ్లు గాఢ నిద్రలోకి జారుకున్న తర్వాత సోదరుడు అత్యంత దారుణంగా హతమార్చాడు. హెూటల్ సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులను ఆలియా(9), అల్షియా(19), అక్ష(16), రహమీన్(18), తల్లి ఆస్మాగా పోలీసులు గుర్తించారు. నిందితుడు ఆర్షద్(24) ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కుటుంబ కలహాల కారణంగానే ఆర్షద్ తన కుటుంబ సభ్యులను హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరంతా ఆగ్రాకు చెందిన వారని పోలీసులు పేర్కొన్నారు.

# గాయని శివశ్రీని పెళ్లాడనున్న ఎంపీ తేజస్వి సూర్య



బెంగళూరు,:: దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీలలో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివారు కాబోతున్నారు. బెంగళూరు సౌత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున వరుసగా రెండోసారి గెలిచిన తేజస్వి సూర్య.. చెన్నైకి చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను పెళ్లి చేసుకోబోతున్నారు. ఈ విషయాన్ని ఎంపీ తేజస్వి సూర్యనే బెంగళూరులో నిన్న ప్రకటించారు. మార్చి 24వ తేదీన బెంగళూరులోనే ఆయన వివాహం జరగనుంది. శివశ్రీ శాస్త్ర యూనివర్సిటీ నుంచి బయో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. మద్రాస్ యూనివర్సిటీ నుంచి భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత కాలేజీలో సంస్కృతంలో ఎంఏ పట్టా పుచ్చుకున్నారు. పొన్నియిన్ సెల్వన్ పార్ట్ -2లో కన్నడ వర్షన్‌లో శివశ్రీ ఓ పాట ఆలపించారు. ఆమె యూట్యూబ్ చానెల్‌కు 2 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. తేజస్వి సూర్య వృత్తి రీత్యా లాయర్. కానీ ప్రస్తుతం ఆయన బెంగళూరు సౌత్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024 ఎంపీ ఎన్నికల్లోనూ ఆయన గెలుపొందారు. 2019 ఎన్నికల్లో 3.31 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. తేజస్వి చేతిలో కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ ఓడిపోయారు. 2020 నుంచి భారతీయ జనతా యువ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

# మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ



న్యూఢిల్లీ, :: దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. కొత్త ఏడాది ఆరంభమైన బుధవారం, బీజేపీ రాజకీయాలకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించారు. బీజేపీ తప్పులకు ఆర్ఎస్ఎస్ మద్దతిస్తుందా? అని కేజ్రీవాల్ నిలదీశారు. 'బీజేపీ నేతలు బహిరంగంగా డబ్బులు పంచుతున్నారు. ఓట్లు కొనేందుకు ఆర్ఎస్ఎస్ మద్దతిస్తుందా? దళిత, పూర్వాంచల్ ప్రజల ఓటర్లను పెద్ద ఎత్తున ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిదని ఆర్ఎస్ఎస్ భావిస్తుందా? ప్రజాస్వామ్యాన్ని బీజేపీ నిర్వీర్యం చేస్తోందా?' అని కేజ్రీవాల్ ఆ లేఖలో ప్రశ్నించారు. కాగా, కేజ్రీవాల్ లేఖపై బీజేపీ ఘాటుగా స్పందించింది. 'అబద్ధాలు, మోసం అనే మీ తప్పుడు అలవాట్లను వదిలిపెట్టి మీలో అర్థవంతమైన మార్పు తీసుకువస్తారని ఆశిస్తున్నాం' అని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా అన్నారు. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్‌కు తాను లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు.

# కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయం

**ఎరువుపై మరింత సబ్సిడీ**

న్యూఢిల్లీ, :: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ 2025 సంవత్సరంలో తొలిసారి సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. డీఏపీ ఎరువుపై రైతులకు ఇచ్చే సబ్సిడీని మరింత పెంచాలని నిర్ణయించింది. డీఏపీపై అదనపు భారాన్ని కేంద్రమే భరించనుంది. ఇకపై ఒక 50 కిలోల డీఏపీ బస్తా రూ.1350 కే లభ్యం కానుంది. కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చూకూరనుంది. అదేవిధంగా 'ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ'కి కేంద్రం రూ.800 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. అంతేగాక పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న పలు ముఖ్యమైన ప్రాజెక్టులపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ఓ ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది.



# ఆనందోత్సవాల మధ్య ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇంట్లో నూతన సంవత్సర వేడుకలు

## ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలి - నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



మంత్రి ఫరూక్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నంద్యాల జనవరి 1 (రిపబ్లిక్ న్యూస్) : ప్రజలు ఈ ఏడాది ఆనందం, ఆరోగ్యంగా ఉండాలని, 2025 నూతన సంవత్సరంలో జిల్లా లోని అన్ని వర్గాల వారు సుభిక్షంగా ఉండాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం పట్టణంలో బొమ్మలసత్రంలోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో ఆనందోత్సవాల మధ్య 2025 నూతన సంవత్సర కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు, బైరెడ్డి అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎంపీ ఇంటికి చేరుకొని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి పూల బొక్కెలు, దండలు, జ్ఞాపికలు అందించి శాలువలతో సన్మానం చేసి నూతన ఆంగ్లనామ సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.



### జిల్లా అభివృద్ధి పై మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ తో సమావేశం

నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధిపై రాష్ట్ర న్యాయశాఖ, మైనారటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ తో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సమావేశం అయ్యారు.

బుధవారం సాయంత్రం మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ కార్యాలయంకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు మంత్రి ఫరూక్ తెలిపిన అనంతరం మంత్రి, ఎంపీ లు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అధిక నిధులు మంజూరుకు కృషి చేద్దాం అన్నారు. ప్రధాన సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొని వెళ్లి ప్రజల సమస్యలకు పరిస్కారం చూపుదాం అన్నారు.

# హత్య కేసులో ముద్దాయి అరెస్ట్...రిమాండ్ కు తరలింపు

### ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి




నంద్యాల క్రైం, జనవరి 1, (రిపబ్లిక్ న్యూస్): ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ముద్దాయి రామ్ సాగర్ సాహ్ని 2024 వ సంవత్సరము జనవరి 01 వ తేదీన పిన్నాపురం గ్రామము దగ్గరలో గల గ్రీన్ కొ సోలార్ కంపెనీ లో పనిచేయుచున్న బీహార్ కు చెందిన మొహమ్మద్ సర్దాబ్ ను హత్య చేసిన కేసులో పరారీలో ఉన్న ఏ1 ముద్దాయి రామ్ సాగర్ సాహ్ని పానవాబ్ పూర్ కాలనీ, బహ్రైద్ టౌన్, జిల్లా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం అనునతనిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపడమయినది. రాత్రి సోలార్ కంపెనీలో పని చేయుచున్న మహమ్మద్ సద్దాబ్ కు, ఏ 2 రాజ్ కిషోర్, ఏ 3 సంక్రామ్ అను వారికి, మహమ్మద్ సద్దాబ్ తన సెల్ ఫోన్ లో పాటలు ఎక్కువ శబ్దము పెట్టుకుని న్యూసెన్స్ చేస్తున్నాడనే విషయములో పై తెలిపిన ముద్దాయిలు మాటా మాటకు పెంచుకుని గొడవపడి ముద్దాయిలు మహమ్మద్ సద్దాబ్ పై దాడి చేసి కర్రతో కొట్టగా మహమ్మద్ సద్దాబ్ ను ఆసుపత్రికి తీసుకుని పోగా తను చికిత్స పొందుతూ చనిపోయాడు. సదరు విషయంపై పాణ్యం పోలీస్ కేసు నమోదు చేసి తదుపరి 20వ తేదీన ఏ2, ఏ3 ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినారు. అయితే ఏ1 ముద్దాయి మాత్రము పోలీసు వారికి దొరకకుండా ఉంటూ పరారీలో ఉన్నాడు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము అత్యంత ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న సోలార్ ప్రాజెక్ట్ లో జరిగిన హత్య విషయములో ముద్దాయి అరెస్ట్ విషయము గురించి నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల డిఎస్పీ శ్రీనివాస రెడ్డి సూచన మేరకు పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి పాణ్యం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ల ఆద్వర్యములో స్పెషల్ టీం ఏర్పాటు చేసుకుని ముద్దాయి రామ్ సాగర్ సాహ్ని ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బహ్రైచ్ జిల్లా పరిదిలోని రిషియా పోలీసు స్టేషన్ పరిదిలో 30.12.2024వ తేదీన అరెస్ట్ చేసి ఈ దినమున రిమాండ్ కు పంపడమయినది. ఈ కేసులో పరారీలో ఉన్న ముద్దాయి ఏ 1 రామ్ సాగర్ సాహ్ని షానవాబ్ పూర్ కాలనీ, బహ్రైచ్ టౌన్, జిల్లా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ను అరెస్ట్ చేయడములో టీం సభ్యులను నంద్యాల ఎస్పీ, డిస్పీ అభినందించారు.

## నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర.శివానందరెడ్డి, ఆయన సతీమణి మాండ్ర. ఉమాదేవి, ఎమ్మెల్యే గిత్త.జయ సూర్య లకు

# నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన వేంపెంట గ్రామ నాయకులు.

పాములపాడు జనవరి 1 (రిపబ్లిక్ న్యూస్):- పాములపాడులోని, వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ, గ్రామ టిడిపి నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, నెమలి రమణారెడ్డి, కంభం.మోహన్ గౌడ్, గంటా. రమేష్, గంటా.మధు సుధాకర్, బాలస్వామి, లెనిన్ బాబు, మల్లికార్జున నాయుడు, వై. దానమయ్య, చంద్రశేఖర్ గౌడ్, చాకలి వెంకటసుబ్బయ్య,తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఆయన సతీమణి మాండ్ర.ఉమాదేవి, ఎమ్మెల్యే గిత్త. జయసూర్య లకు నూతన సంవత్సరం-2025 శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వేంపెంట గ్రామ నాయకులు, కార్యకర్తలు అందరూ మాండ్ర.శివానందరెడ్డి, మాండ్ర. ఉమాదేవి, గిత్త.జయసూర్య, మాండ్ర.సురేంద్ర నాథ్ రెడ్డి లకు పుష్పగుచ్చాలు, పండ్లు, స్వీట్స్, ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఒకరికి ఒకరు స్వీట్స్, కేక్ ముక్కలు తినిపించుకొని నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



## కళారాధన, దివ్యాంగుల కార్యాలయంలో

# నూతన సంవత్సర వేడుకలు



డాక్టర్ రవి కృష్ణ శుభాకాంక్షలు తెలుపుతున్న నంద్యాల జిల్లా చిన్న వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం సభ్యులు

నంద్యాల జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) :

నూతన ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకొని కళారాధన, దివ్యాంగుల సంక్షేమ సంఘం, ఐఎంఏ, లయన్స్ క్లబ్ ,క్రీడా సంఘాల కార్యాలయంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కళారాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ కు కళాకారులు, దివ్యాంగులు, క్రీడాకారులు, క్రీడా సంఘాల నిర్వాహకులు, వైద్యులు,లయన్స్ క్లబ్ సభ్యులు,చిన్న, వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం సభ్యులు, వివిధ రంగాల ప్రజలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో కళా, క్రీడా, దివ్యాంగుల కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు,వివిధ సంఘాల సభ్యుల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని అన్నారు.

## వెలుగోడు మండల బిజెపి అధ్యక్షుడిగా పాతుల రాజా శేఖర్ రెడ్డి ఏక గ్రీవంగ ఎన్నిక.



వెలుగోడు జనవరి 1 రిపబ్లిక్ న్యూస్

వెలుగోడు పట్టణ బిజెపి కార్యాలయం లో గురువారం బూత్ కమిటీ సభ్యులు వెలుగోడు మండల అధ్యక్షుడుగా పాతుల రాజా శేఖర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి అంతి రెడ్డి అరవింద్ రెడ్డి పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు . ఈ సందర్భంగా బిజెపి వెలుగోడు మండల అధ్యక్షులు పాతుల రాజా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ నామీద నమ్మకంతో వరుసగా రెండవసారి మండల అధ్యక్షునిగా ఎన్నుకొని బాధ్యతను అప్పజెప్పినందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరికి, బిజెపి నంద్యాల జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధుకి, బిజెపి జిల్లా ఎన్నికల అధికారి చంద్రమౌళి కి, మండలంలోని బిజెపి నాయకులకు, కార్యకర్తలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నా మీద నమ్మకంతో ఈ బాధ్యతను ఉంచినందుకు బిజెపి పార్టీ ని మండలంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి చేసి, మరింత పటిష్టం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వడ్ల ప్రతాప్ ఆచారి, నూలు నాగేశ్వరరావు, పురుషోత్తం గౌడ్, శ్రీనువాసులు, వెంకటసుబ్బయ్య, పవన్, మహేష్, తిరుపతయ్య మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెలుగోడు తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు.

వెలుగోడు జనవరి 1 రిపబ్లిక్ న్యూస్ సంక్రాంతి పండుగ పురస్కరించుకొని వెలుగోడు పట్టణంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను వెలుగోడు తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు రామకృష్ణ, జయ రాముడు, శీను, సురేష్, నాగ శివ, తిమ్మప్ప లు తెలిపారు. ఈ పోటీలు. జనవరి ఆరవ తేదీ సోమవారం నుండి ప్రారంభమవుతాయన్నారు.మొదటి బహుమతి 30 వేల 16 రూపాయలు మరియు ట్రోఫీ ద్వితీయ బహుమతి 15 వేల 16 రూపాయలు మరియు ట్రోఫీ తృతీయ బహుమతి 7 వేల 16 రూపాయలు మరియు ట్రోఫీ విజేతలకు అందజేయడం జరుగుతుందన్నారు.ఈ పోటీలలో పాల్గొను వారు ఎంట్రీ ఫీజు 600 జనవరి ఐదో తేదీ సాయంత్రం లోగా చెల్లించి తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.క్రీడాకారులకు నిర్ణయించిన సమయానికి అరగంట ముందు హాజరు కావాలన్నారు.అంపైర్ నిర్ణయమే తుది నిర్ణయం అన్నారు.పూర్తి వివరములు కొరకు 96 400 21 931 మరియు 83 284 67 691 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## నేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ.

వెలుగోడు జనవరి 1 రిపబ్లిక్ న్యూస్ నేడు వెలుగోడు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభను నిర్వహిస్తున్నట్లు ఈవో ఆర్ డి. మురహరి తెలిపారు. ఈ గ్రామ సభలో పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాలు సర్పంచ్ జయపాల్, గ్రామ కార్యదర్శి .ఎన్ ఆర్ జి ఎస్ అధికారులు గ్రామ ప్రజల తో చర్చించి పనులను నిర్ణయిస్తారన్నారు.

## వక్ఫ్ బోర్డు సీనియర్ అసిస్టెంట్ మృతికి మంత్రి ఫరూక్ సంతాపం.



రిపబ్లిక్ న్యూస్ అమరావతి జనవరి01: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు కేంద్ర కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న షేక్ మహమ్మద్ షైఫుల్లా(56) మృతికి రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం వక్ఫ్ బోర్డు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉదయం 11:30 గంటల సమయంలో మహమ్మద్ షైఫుల్లా గుండెపోటుకు గురయ్యారు. సహచర సిబ్బంది వెంటనే అప్రమత్తమై చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా కోలుకోలేక షైఫుల్లా మృతి చెందినట్లు కార్యాలయం వర్గాలు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి ఫరూక్ జరిగిన ఘటనకు సంబంధించి వివరాలు ఆరా తీశారు. షైఫుల్లా గుండెపోటుకు గురై మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతికి గురైనట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని సంతాపం వ్యక్తం చేస్తూ, షైఫుల్లా కుటుంబ సభ్యులకు మనోధైర్యం ను భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సంతాపం ప్రకటించారు.

# వైజాగ్ సెంట్రల్ జైల్లో కలకలం

## సెల్‌ఫోన్లను పాతిపెట్టిన ఖైదీలు



విశాఖపట్నం: వైజాగ్ సెంట్రల్ జైల్లో మొబైల్ ఫోన్లు దొరకడం ఏపీ వ్యాప్తంగా కలకలం రేపుతోంది. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా పెన్నా బ్యారక్ సమీపంలో పోలీసులకు నాలుగు అడుగుల లోతులో పాతిపెట్టిన ఓ ప్యాకెట్ కనిపించింది. పెన్నా బ్యారక్ సమీపంలోని పూల కుండీల వద్ద భూమిలో 4 అడుగుల లోతులో ఈ ఫోన్లను కవర్‌లో పెట్టి పాతిపెట్టారు. వాటిపై రెండు రాళ్లు కప్పి పైన పూల కుండీని పెట్టారు. అనుమానాస్పదంగా కనిపించడంతో దాన్ని పరిశీలించగా అందులో రెండు సెల్‌ఫోన్లు, ఒక పవర్ బ్యాంక్, రెండు చార్జింగ్ వైర్లు, ఫోన్ బ్యాటరీ కనిపించాయి. సెల్‌ఫోన్లు దొరకడంతో పోలీసులు అప్రమత్తమై వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ సెల్‌ఫోన్లలో సిమ్ కార్డులు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే ఈ విషయం తెలియగానే వైజాగ్ సీపీ శంఖబ్రత బాగ్చీ రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. సిమ్ కార్డులు దొరికన పెన్నా బ్యారక్‌లో రౌడీ షీటర్ హేమంత్ కుమార్ ఉన్నట్లుగా తెలుస్తోంది. విశాఖ సెంట్రల్ జైలు వివాదాలపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పందించారు. సెంట్రల్ జైల్లో పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. వ్యవస్థలు ఏ స్థాయిలో నిర్వీర్యమయ్యాయో అర్థమవుతోందని అన్నారు. జైల్లో గంజాయి, సెల్‌ఫోన్ల ఘటనపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

.........................................................................

# ఒంటినిండా బంగారంతో శ్రీవారిని దర్శించుకున్న భక్తుడు

## సోషల్‌మీడియాలో వీడియో వైరల్

తిరుమల, :



న్యూ ఇయర్ సందర్భంగా తిరుమల శ్రీవారిని ఓ భక్తుడు దర్శించుకోవడం ఇప్పుడు వైరల్‌గా మారింది. ఏడుకొండల వాడిని రోజుకు లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు కదా.. అందులో వింత ఏముందని అనుకుంటున్నారా! వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంలో వింత లేదు.. అయితే వచ్చిన భక్తుడు ఒంటి నిండా బంగారంతో రావడమే ఇప్పుడు అందర్నీ ఆకట్టుకుంటుంది. హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి కొండా విజయ్ కుమార్ మంగళవారం నాడు ఇంటి నిండా బంగారంతో తిరుమలకు వచ్చాడు. దాదాపు 5 కిలోల బంగారు ఆభరణాలను ధరించి అతను శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్‌లో వేచి ఉన్న విజయ్‌కుమార్ ధరించిన భారీ ఆభరణాలు.. మిగతా భక్తుల దృష్టిని ఆకర్షించాయి. మెడలో, చేతికి ఉన్న భారీ ఆభరణాలను భక్తులు ఆసక్తిగా పరిశీలించారు. అయితే బంగారంపై తనకు ఆసక్తి ఎక్కువ అని.. అందుకే ఇలా భారీ ఆభరణాలు చేయించుకుని, ధరిస్తున్నానని విజయ్‌కుమార్ తెలిపారు.

.........................................................................

# ప్రతి ఇంటా సంతోషాన్ని నింపుతాం

## ప్రజల జీవన ప్రమాణాలు పెంచటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### నూతన సంవత్సర వేడుకలలో మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్





నంద్యాల జనవరి 1( రిపబ్లిక్ న్యూస్) :.

ప్రతి ఇంటా సంతోష సంబరాలు నింపుతామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకలలో మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ని , టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని కలవడానికి భారీ సంఖ్యలో జనాలు తెలుగుదేశం పార్టీ కార్యాలయం చేరుకోవడం జరిగింది అనంతరం నూతన సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలు, నాయకులు అందించిన సహకారం మరువలేనిదన్నారు . పార్టీ అధిష్టానం ఇచ్చిన ప్రతి పిలుపును అందుకొని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయడంలో తీవ్రంగా శ్రమించారని గుర్తు చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల్లో గందరగోళ వాతావరణం నెలకొని ఉండేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారని పేర్కొన్నారు. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నారని వివరించారు. సూపర్ సిక్స్ లో పొందుపరిచిన ప్రతి పథకాన్ని ప్రాధాన్యత క్రమంలో అందిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు తోడుగా నిలుస్తున్నారని అన్నారు. ప్రజల సహాయ సహకారాలతో నంద్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా నిలిపేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ వేడుకల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ అధికారులు మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి ఫరూక్ , ఎన్ఎండి ఫిరోజ్ , ఎన్ఎండి ఫయాజ్ లకు నూతన సంవత్సర 2025 శుభాకాంక్షలు తెలియజేశారు.

## నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర.శివానందరెడ్డి, ఆయన సతీమణి మాండ్ర. ఉమాదేవి లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన పోలీస్ అధికారులు.

**నందికొట్కూరు జనవరి-1 (రిపబ్లిక్ న్యూస్):-**



నందికొట్కూరు నియోజవర్గంలోని, అల్లూరు టిడిపి కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర. శివానందరెడ్డి, ఆయన సతీమణి మాండ్ర.ఉమాదేవి లకు ఆత్మకూరు డిఎస్పి- ఆర్.రామాంజి నాయక్, ఆత్మకూరు రూలర్ సిఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి, నందికొట్కూరు అర్బన్ సిఐ- ప్రవీణ్ కుమార్ రెడ్డి, రూలర్ సిఐ సుబ్రహ్మణ్యం, నియోజవర్గంలోని ఎస్ఐలు- పాములపాడు ఎస్ఐ- కే.సురేష్ బాబు, తదితర ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పుష్పగుచ్చాలు చేతికి అందించి, నూతన సంవత్సర-2025 శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారుల సమక్షంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర. శివానందరెడ్డి, మహిళా నాయకురాలు మాండ్ర.ఉమాదేవి లు భారీ కేక్ ను కట్ చేసి, ఒకరికి ఒకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు మాండ్ర.సురేంద్రనాథ్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పిఏ.మద్దిలేటి, నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్-మొల్ల.రబ్బాని, రెండవ వార్డ్ కౌన్సిలర్ మొల్ల.జాకీర్ హుస్సేన్, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనడం జరిగింది.

.........................................................................

# జనసేన కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు

## కేక్ కట్ చేసిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు

విజయనగరం,:





నూతన సంవత్సరం-2025లో జిల్లా ప్రజలంతా సుఖః సంతోషాలతో ఉండాలని జనసేన నాయకులు అవనాపు విక్రమ్, డాక్టర్ అవనాపు భావన దంపతులు ఆకాంక్షించారు. విజయనగరం బాలాజీ నగర్ లోని జనసేన కార్యాలయంలో బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో అవనాపు విక్రమ్ భావన పాల్గొని కేక్ కట్ చేసి, వీర మహిళలు, జనసైనికులు, అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ మాట్లాడుతూ మనం ఇప్పుడు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నప్పటికీ ఆరు నెలల క్రితమే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం ద్వారా నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ఆరునెలలుగా అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కనులుగా చేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అడుగులు ముందుకు వేస్తున్నారని అన్నారు. జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్ని జిల్లాలలో పర్యటన చేస్తామని, అక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించడం 2025 వ నూతన సంవత్సరంలో శుభపరిణామమని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల్లో ఉండడం, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు దూరంగా జరగడం కాదని, నాయకుడు నిత్యంలో ప్రజల్లో ఉండాలని పవన్ కళ్యాణ్ సంకల్పించడం గొప్ప అంశమని అన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పని చేయడం గొప్ప అవకాశమని, వీరమహిళలు, జనసైనికుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం ఆనందగా ఉందని అవనాపు విక్రమ్ అన్నారు. జిల్లాలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపిన డాక్టర్ అవనాపు భావన , ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్టాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకువెళ్తున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా అంతా కలసి కట్టుగా పనిచేసి, రాష్ట్రాభివృద్దిలో బాగస్వాములు కావాలని భావన కోరారు. కార్యక్రమంలో వీర మహిళలు, జనసైనికులు, అవనాపు అభిమానులు పాల్గొని భావన విక్రమ్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# వక్ఫ్ బోర్డు భూముల్లో జిల్లా ఎస్పీ కార్యాలయం నిర్మించడం హర్షించదగ్గ విషయం..! -ముస్లిం ఫెడరేషన్



నంద్యాల జనవరి 01( రిపబ్లిక్ న్యూస్) :.:మైనార్టీ మంత్రి ఎన్.ఎమ్.డి ఫరూక్ నంద్యాల వక్ఫ్ బోర్డు భూముల్లో జిల్లా ఎస్పీ కార్యాలయం కొరకు ప్రభుత్వాన్ని అనుమతి కోరడం చాలా చాలా హర్షించదగ్గ విషయమని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు న్యాయవాది సుహైల్ రానా మహబూబ్ బాషా ముల్లా ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ..ఇప్పటికే నంద్యాలలో వందల కోట్ల రూపాయల వక్ఫ్ భూములు కబ్జా దారుల కోరల్లో చిక్కుకుని అన్యాక్రాంతం అయ్యాయని.వక్ఫ్ భూముల్లో ఎస్పీ కార్యాలయం నిర్మిస్తే పోలీసు శాఖకు అయిన బయపడి వక్ఫ్ భూమి కబ్జా కాకుండా ఉంటుందని ఇది నంద్యాల అభివృద్ధికి శుభపరిణామమని తెలిపారు. అలాగే కబ్జా కాకుండా ఉన్న వక్ఫ్ భూముల చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయాలని మంత్రి కి విజ్ఞేప్తి చేశారు ప్రభుత్వ అనుమతితో వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు.

# విజయవాడలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

అమరావతి,: ఏపీలోని విజయవాడ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. విజయవాడలోని మార్టూరు మండలం దేగరమూడి సమీపంలో లారీ బైక్‌ను ఢీ కొట్టింది. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మద్యం మత్తులో కరెంట్ స్తంభం ఎక్కిన యువకుడు

## హాయిగా తీగల మీద నిద్ర.. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపేసిన స్థానికులు



అమరావతి,:పీకలదాకా తాగిన తర్వాత మందుబాబులు వేసే చిందులు అన్నీ ఇన్నీ కావు.. వాళ్లు చేసే చేష్టలు నభూతో న భవిష్యత్తు అనిపించేలా ఉంటాయి. న్యూఇయర్ వేళ ఓ మందుబాబు చేసిన పని కూడా ఇప్పుడు అలాగే ఉంది. డిసెంబర్ 31కి దావత్ అని ఫుల్లుగా తాగిన ఓ మందుబాబు ఏకంగా పోల్ ఎక్కి కరెంటు తీగలపైనే పడుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎం.సింగపురంలో మంగళవారం నాడు ఓ మందుబాబు హల్‌చల్ చేశాడు. డిసెంబర్ 31 అని పొద్దున్నే తాగేశాడు. అయినా చాలకపోవడంతో మందుకు డబ్బు కావాలని ఇంటికెళ్లి వాళ్ల అమ్మను అడిగాడు. కానీ ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో కోపంలో బయటకు వెళ్లిన అతను.. దగ్గరలో ఉన్న కరెంటు పోల్ ఎక్కేశాడు. మద్యం మత్తులో అతను విద్యుత్ స్తంభం ఎక్కడం చూసిన పలువురు అతని దగ్గరకు పరిగెత్తారు. కానీ వాళ్ల మాటలేమీ పట్టించుకోకుండా అతను పైకి ఎక్కేశాడు. దీంతో కరెంటు తీగలు ముట్టుకుంటాడేమో అన్న భయంతో స్థానికులు ట్రాన్స్‌ఫార్మర్ ఆపేశాడు.

# అపహరణకు గురైన వ్యాపారవేత్త హత్య

హైదరాబాద్,: హైదరాబాద్ పంజాగుట్టలో అపహరణకు గురైన వ్యాపారవేత్త విష్ణురూపాని హత్యకు గురయ్యాడు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. డిసెంబరు 29న పంజాగుట్టలో విష్ణురూపాని అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఆర్ నగర్‌లోని బుద్ధనగర్‌లో ఓ గది నుంచి దుర్వాసన వస్తుండటంతో బుధవారం స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా.. గదిలో విష్ణురూపాని మృతదేహం పడి ఉంది. గదికి బయట నుంచి తాళం వేసి ఉండటంతో హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# అణుస్థావరాల జాబితా పరస్పర మార్పు

## ఒప్పందాన్ని మరో ఏడాది పొడించిన భారత్, పాక్



న్యూఢిల్లీ,: భారత్, పాకిస్థాన్ తమ దేశాల్లోని అణు స్థావరాల జాబితాను పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా పాటించాయి. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒకరి దేశంలోని అణు కేంద్రాలపై మరో దేశం దాడి చేయకూడదనే ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఈ జాబితాను అందజేసుకున్నాయి. ఇరుదేశాలు ఏకకాలంలో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. 'దౌత్యమార్గాల ద్వారా భారత్, పాకిస్థాన్ తమ అణు స్థావరాల జాబితాను పంచుకున్నాయి. ఏకకాలంలో ఈ ప్రక్రియ పూర్తయ్యింది. కశ్మీర్ సమస్యతో పాటు సీమాంతర ఉగ్రవాదంపై కూడా రెండు దేశాల మధ్య జాబితా మార్పిడి జరిగింది. ఈ జాబితాను ఇలా ఇచ్చిపుచ్చుకోవడం ఇది వరుసగా 34వ సారి' ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా.. అణు స్థావరాలపై దాడులకు వ్యతిరేకంగా కుదిరిన ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు ఈ వివరాలను పరస్పరం అందజేసుకుంటున్నాయి. 1988 డిసెంబర్ 31న ఈ ఒప్పందంపై భారత్, పాక్ సంతకం చేశాయి. ఆర్టికల్-2 నిబంధన ప్రకారం ప్రతి సంవత్సరం అణు స్థావరాల సమాచారం అందజేసుకోవాలి. దీని ప్రకారం 1992 జనవరి 1 నుంచి ప్రతి సంవత్సరం అదే రోజు అణు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయి.

# బోరుబావి నుంచి బాలిక వెలికితీత

## పదిరోజుల తరవాత ఎట్టకేలకు ఆపరేషన్ సక్సెస్

జయపుర: రాజస్థాన్‌లోని కోఠ్‌పుత్లీ జిల్లాలో ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిన బాలికను అధికారులు.. 10రోజుల తర్వాత ఎట్టకేలకు చిన్నారిని వెలికితీశారు. అనంతరం ఆసుపత్రికి తరలించారు. అయితే, చిన్నారి ప్రస్తుత పరిస్థితిపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కోఠ్‌పుత్లీ జిల్లాలోని కిరాట్‌పుర గ్రామానికి చెందిన మూడేళ్ల చేతన డిసెంబరు 23న తన తండ్రితో కలిసి పొలానికి వెళ్లింది. అక్కడ ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అధికారులను ఆశ్రయించారు. దీంతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి భారీ ఆపరేషన్ చేపట్టారు. తొలుత హుకప్‌టెక్నిక్‌తో చిన్నారిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. సఫలం కాకపోవడంతో బోరుబావికి సమాంతరంగా సొరంగాన్ని తవ్వారు. ర్యాట్‌హోల్ మైనర్స్‌ను రంగంలో దించారు. పాలింగ్ మిషన్‌తో బోర్‌వెల్‌కు సమాంతరంగా 170 అడుగుల సొరంగాన్ని తవ్వారు. ఆమెను చేరుకునే మార్గంలో పెద్ద బండరాయి అడ్డుగా ఉండటంతో ఆపరేషన్‌కు ఆటంకం ఏర్పడింది. ఇదే సమయంలో పైప్‌ల ద్వారా లోపలికి ఆక్సిజన్ పంపించడంతోపాటు.. కెమెరాల్లో బాలిక కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించారు. చివరకు 10రోజుల తర్వాత చిన్నారని బయటకు తీసుకువచ్చారు.

# కొత్త ఏడాది వేళ భారీగా ట్రాఫిక్ ఉల్లంఘనలు



ముంబయి,:: కొత్త సంవత్సరం వేళ భారీ సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్న క్రమంలో భారీగా ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదు అయ్యాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో కొత్త ఏడాది సంబరాల వేల పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి. ఒక్క రాత్రిలోనే 17,800 వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు పోలీసులు పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నగరంలో పోలీసులు బుధవారం తెల్లవారుజాము వరకూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి వద్ద నుంచి మొత్తం రూ.89.19 లక్షలను జరిమానాల రూపంలో విధించినట్లు చెప్పారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, సిగ్నళ్లు జంప్ చేయడం, డ్రంకన్ డ్రైవ్ కేసులు వీటిల్లో ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా.. నగరంలో 8 మంది అదనపు కమిషనర్లు, 29 మంది డిప్యూటీ కమిషనర్లు, 53 మంది అసిస్టెంట్ కమిషనర్లు, 2,184 మంది ఇన్‌స్పెక్టర్లు, 12 వేలకుపైగా కానిస్టేబుళ్లు రోడ్లపై విధులు నిర్వర్తించారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

# ఆదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు

## తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం




చెన్నై,:
అదానీ కంపెనీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు అదానీ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఇటీవల అమెరికా పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (ఎఇఎస్ఎల్)తో స్మార్ట్ మీటర్ల సేకరణ కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పోరేషన్ (టిఎఎన్‌జిఇడిసిఒ) చేసుకున్న ఒప్పందాన్ని స్టాలిన్ ప్రభుత్వం రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అధిక ధరలను కోట్ చేశారని, అందుకే ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.కేంద్ర ప్రభుత్వ పథకం కింద 2023 ఆగస్టులో నాలుగు ప్యాకేజీలుగా టెండర్లు జరిగాయి. చెన్నై సహా ఎనిమిది జిల్లాలను కవర్ చేసే టెండర్‌లో ప్యాకేజీ 1కి కి అదానీ సంస్థ 82 లక్షలకు పైగా స్మార్ట్ మీటర్లను పంపిణీ చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అదానీ సంస్థ కోట్ చేసిన ధర అధికంగా ఉన్నందున డిసెంబర్ 27, 2024న టెండర్‌ను రద్దు చేసినట్లు వెల్లడించాయి. మరో మూడు ప్యాకేజీల టెండర్లను కూడా రద్దు చేశామని తెలిపింది. మరోసారి టెండర్లను ఆహ్వానించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. 2020-2024 మధ్య లాభదాయకమైన సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం అదానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ.2029 కోట్ల ముడుపులు ముట్టజెప్పడం లేదా ఇస్తానని వాగ్దానం చేయడం వంటి చేశారని అమెరికా న్యాయశాఖ అక్కడి కోర్టుకు తెలియజేసింది. సెకీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునేలా ఆ వ్యక్తులు పలు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను ఒప్పించారు. ఆ విధంగా కొన్ని రాష్ట్ర విద్యుత్ కంపెనీలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2021 జులై, 2022 ఫిబ్రవరి మధ్య కాలంలో ఒరిస్సా, జమ్ము కాశ్మీర్, తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. ఇందుకు సంబంధించి 54 పేజీల నేరాభియోగ పత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేసినట్లు అమెరికా పత్రిక ఫైనాన్సియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ అభియోగ పత్రంలోని వివరాలను ప్రముఖ అమెరికన్ పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడించడంతో ఈ భాగోతం బయటపడింది. నేరాభియోగ పత్రంలో కేటగిరీల వారీగా, వ్యక్తుల వారీగా ఎవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పడం లేదా హామీ ఇవ్వడమో చేశారని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ అదానీని కూడా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ప్రతివాదుల జాబితాలో చేర్చారు.

# రాచకొండ పరిధిలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

## దాదాపు 619 కేసులు నమోదు



హైదరాబాద్,:
దేశ వ్యాప్తంగా న్యూఇయర్ సంబరాలు అంబరాన్ని అంటాయి. న్యూఇయర్ సందర్భంగా యువత ఎంతో ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకున్నారు. కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. న్యూఇయర్ వేడుకల్లో నో ఆల్కహాల్ అంటూ పోలీసులు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తాగి వాహనాలు నడిపిన వారి పనిపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మందు సేవించిన వారిని పట్టుకున్నారు. వారిపై కేసులు కూడా నమోదు చేశారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి. పెద్ద సంఖ్యలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు పోలీసులు. బుధవారం ఉదయం వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మందు సేవించి వాహనం నడిపిన అనేక మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనిఖీల్లో మద్యం సేవించిన అనేక మంది పోలీసులకు చిక్కారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 619 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి. మల్కాజ్‌గిరి డివిజన్‌లో 230 కేసులు నమోదు కాగా భువనగిరి డివిజన్లో 84 కేసులు నమోదయ్యాయి. అలాగే ఎల్బీనగర్లో 232 కేసులు నమోదు అవగా.. మహేశ్వరంలో 47 కేసులు నమోదయ్యాయి. మరోవైపు పంజాగుట్టలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన పోలీసులు పెద్ద షాకే తగిలింది. వెంగల్‌రావు పార్క్ వద్ద మద్యం సేవించి వెళుతుండగా ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సదరు వ్యక్తికి బ్రీత్ ఎన్‌లైజర్ టెస్ట్ నిర్వహించగా..
అందులో వచ్చిన సంఖ్య చూసి పోలీసులు అవాక్కయ్యారు. బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో 550 రీడింగ్ నమోదు అయ్యింది. 550 ఆల్కహాల్ రీడింగ్ రావడంతో ఆశ్చపోవడం పోలీసుల వంతైంది. వెంటనే ఆ వ్యక్తిపై కాప్స్ కేసు నమోదు చేశారు. అయితే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికి 550 పాయింట్స్ వచ్చిన ఆ వ్యక్తి మాత్రం.. తాను రేవంత్ అన్న తాలూకా అంటూ పోలీసుల ఎదుట బుకాయింపుకు దిగాడు.

# ఎయిరిండియా విమానాల్లో వైఫై సౌకర్యం

## అందుబాటులోకి తెచ్చిన టాటా గ్రూపు




న్యూఢిల్లీ,: టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా వైఫై ఇంటర్నెట్ సర్వీసులకు శ్రీకారం చుట్టింది. దేశీయ, విదేశీ విమాన సర్వీసుల్లో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఎయిర్‌బస్ ఏ350, బోయింగ్ 787-9తో పాటు ఎంపిక చేసిన ఏ321 నియో విమానాల్లో ఈ సేవలు లభిస్తాయి. దేశీయంగా ఈ తరహా సేవలందిస్తున్న తొలి విమాన సంస్థ తమదేనని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం న్యూయార్క్, లండన్, పారిస్, సింగపూర్ వంటి అంతర్జాతీయ మార్గాల్లో నడుస్తున్న ఎయిర్‌బస్ ఏ350, ఎయిర్‌బస్ ఏ321 నియో, బోయింగ్ బి787-9 ఎయిర్ క్రాఫ్ట్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎయిరిండియా వైఫై సేవలను అందిస్తోంది. దీనికి కొనసాగింపుగా దేశీయంగానూ ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపింది. ల్యాప్‌టాప్, టాబ్లెట్లు, ఐఓఎస్, ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వంటి డివైజుల్లో ఈ వైఫై సేవలను ఆనందించొచ్చు. విమానం 10 వేల అడుగుల ఎత్తుకు చేరాక ఈ సేవలు లభిస్తాయి. ఒకేసారి పలు డివైజులను వైఫైకి కనెక్ట్ చేయొచ్చు. తొలుత కాంప్లిమెంటరీగా ఈ సేవలు లభిస్తాయని, త్వరలో మరిన్ని విమానాల్లోనూ ఈ సేవలను ప్రారంభించనున్నట్లు ఎయిరిండియా తెలిపింది.

# షరతుల పేరుతో రైతుల నోట్లో మట్టికొట్టే యత్నం

## రైతుభరోసాపై హరీష్ రావు విమర్శలు

సంగారెడ్డి,: షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పత్తి, చెరకు, పసుపు పంటలకు ఒకసారి మాత్రమే రైతు భరోసా ఇస్తామంటున్నారు. కొండలు, గుట్టలు సాగు చేసే వారికి రైతు భరోసా రాదని చెబుతున్నారు. ఇప్పుడు రైతు భరోసాకు కూడా షరతులు పెడుతున్నారు.రైతు భరోసా కోసం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటారంట. బడా కంపెనీలు, కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం ఎలాంటి షరతులు ఉండవు. రైతులను దోషిగా నిలబెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? రైతులను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఏ దరఖాస్తు లేకుండా భారాస ప్రభుత్వం రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ నాయకుల చుట్టూ రైతులు తిరగాలని ఈ ప్రభుత్వం చూస్తోంది.

# నూతన సంవత్సరం తొలిరోజున 2 వేల మందిని కలిసిన సీఎం చంద్రబాబు

## సంవత్సరాది రోజున వేడుకలకు దూరంగా సీఎం చంద్రబాబు

## ప్రజలకు చేరువగా గడిపిన వైనం

## పేదలకు ఉపయోగపడే సీఎంఆర్‌ఎఫ్ నిధుల ఫైల్ పై సంతకం





ఏపీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నేడు నూతన సంవత్సరాది సందర్భంగా వేడుకలకు దూరంగా, ప్రజలకు చేరువగా గడిపారు.,600 మంది పేదలకు రూ.24 కోట్లు విడుదల చేసే సీఎంఆర్‌ఎఫ్ ఫైల్ పై సంతకంతో నూతన సంవత్సరం మొదటి రోజును ప్రారంభించారు. అనంతరం, ఉదయం 10.45 గంటలకు టీటీడీ అర్చకులతో ఆశీర్వాదం తీసుకున్నారు.
ఉదయం 11 గంటల నుంచి తన నివాసంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వివిధ శాఖల అధికారులను కలిశారు. మధ్యాహ్నం 12.20 గంటల తర్వాత విజయవాడ దుర్గగుడిలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మీడియా ద్వారా ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ్నించి మధ్యాహ్నం 1.30 గంటలకు గవర్నర్ వద్దకు వెళ్లి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు.
మధ్యాహ్నం 2.30 గంటల తరువాత మీడియా ప్రతినిధులతో పలు అంశాలపై చిట్ చాట్ నిర్వహించారు. అనంతరం 3.15 గంటల తర్వాత పార్టీ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన చంద్రబాబు దాదాపు 1500 మందితో పార్టీ కార్యాలయంలో ఫోటోలు దిగారు. తనను కలిసిన ప్రతి ఒక్కరి నుంచి విషెస్ స్వీకరించారు. ఇక, సాయంత్రం 6 గంటల తర్వాత సచివాలయానికి వెళ్లారు. అక్కడ సీఎంవో అధికారులతో సమావేశమయ్యారు. సచివాలయం మొదటి బ్లాక్ లో ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులతో గంటపాటు సమావేశయ్యారు. తన ఆలోచనలు చెప్పి....వారి సూచనలు తీసుకున్నారు. రాత్రి గం. 7.15 తర్వాత... రేపటి క్యాబినెట్ అజెండాపై సీఎంవో అధికారులతో చర్చించి... మరి కొంత మంది నాయకులను సచివాలయంలోనే కలిశారు. అనంతరం ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. కాగా, రేపు (జనవరి 2) సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలకు అనుమతులు ఇచ్చే విషయమై ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి.



# కెప్టెన్సీ రేసులో బుమ్రా

## రోహిత్ శర్మ జట్టుకు గుడ్ బై చెప్పే అవకాశాలు

ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ ఓవైపు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఓ టెస్టు గెలిచి రెండు టెస్టులు ఓడిపోయింది. ఇప్పుడు తప్పక గెలవాల్సిన సిడ్నీ టెస్టులో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తోంది. అయితే అన్నింటి కంటే పెద్ద సమస్యగా మారిన టెస్టు జట్టు కెప్టెన్సీ విషయంలో బీసీసీఐ సైతం మల్లగుల్లాలు పడుతోంది. టీమిండియాలో ఉన్న పరిమిత ఆప్షన్లే అందుకు కారణంగా కనిపిస్తున్నాయి. దీంతో రోహిత్ శర్మ సిడ్నీ టెస్టు తర్వాత తప్పుకుంటే కొత్త కెప్టెన్ ఎవరన్న చర్చ జరుగుతోంది. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్ లో ప్రస్తుతం కంగారూలు 2-1 ఆధిక్యంలో ఉన్నారు. సిడ్నీలో ఎల్లుండి ప్రారంభమయ్యే చివరి టెస్టులో భారత్ తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్ లో గెలిస్తే సిరీస్ సమం చేసే అవకాశాలు, అలాగే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ రేసులో నిలిచే అవకాశాలు ఉంటాయి. అయితే ప్రస్తుతం టీమిండియా ఫామ్, కెప్టెన్ రోహిత్ శర్మ వ్యక్తిగత ప్రదర్శన, ఇతర ఆటగాళ్ల ఫామ్ ఇలా ఎటు చూసినా ఆందోళనకర పరిస్థితులే నెలకొన్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే సిడ్నీ టెస్టు తర్వాత రోహిత్ శర్మ తప్పుకుంటే పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. సిడ్నీ టెస్టు తర్వాత రోహిత్ శర్మతో పాటు కోహ్లీ కూడా జట్టుకు గుడ్ బై చెప్పే అవకాశాలు ఉన్నాయి. రోహిత్ చివరి నిమిషంలో నిర్ణయం మార్చుకుంటే తప్ప భారత్ కు కొత్త కెప్టెన్ ను వెతుక్కోక తప్పని పరిస్థితి. దీంతో పెర్త్ టెస్టులో కెప్టెన్సీ తీసుకుని భారత్ ను గెలిపించిన పేసర్ జస్ ప్రీత్ బుమ్రా ఇప్పుడు టెస్టు జట్టు కెప్టెన్సీ ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. ప్రస్తుతం జట్టుకు వైస్ కెప్టెన్ గా ఉన్న బుమ్రా కెప్టెన్సీ రేసులో ముందున్నాడు. అయితే బుమ్రా తరచూ గాయాల పాలవుతుండటం, జట్టుకు అందుబాటులో ఉండకపోవడంతో అతన్ని నమ్మి టెస్టు కెప్టెన్సీ అప్పజెప్పే పరిస్థితీ లేదు. దీంతో బీసీసీఐ ఆలోచనలో పడింది. ఇందుకు బీసీసీఐ వద్ద ఉన్న మరో పరిష్కారం కెప్టెన్సీ విభజన. రోహిత్ తరహాలో బుమ్రా టెస్టు, టీ20 ఫార్మాట్లలో జట్టును నడిపించే పరిస్థితి లేదు. దీంతో టెస్టు జట్టుకు ప్రస్తుతానికి బుమ్రాను కెప్టెన్ గా ప్రకటించి వన్డేలకు కొత్త కెప్టెన్ ను వెతుక్కోవడమే మేలనిపిస్తోంది. రోహిత్ ఇంకా వన్డేల్లో రిటైర్మెంట్ తీసుకోలేదు. కాబట్టి ఎలాగో ఛాంపియన్స్ ట్రోఫీ వరకూ అందుబాటులో ఉంటాడు. ఆ తర్వాత కెఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ లలో ఒకరికి వన్డే కెప్టెన్సీ ఇచ్చే అవకాశాలున్నాయి. టీ20ల్లో ఎలాగో సూర్యకుమార్ యాదవ్ ఇప్పటికే మంచి కెప్టెన్ గా రాణిస్తున్నాడు. కాబట్టి ఇదే బీసీసీఐకి బెటర్ ఆప్షన్ లా ఉంది.

# రిషబ్ పంత్‌పై వేటు పడేనా?

## జట్టు మేనేజ్ మెంట్ కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం

## జట్టులోకి రానున్న ధృవ్ జురెల్




బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదో టెస్ట్ జనవరి 3 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ సిరీస్ లో ఆస్ట్రేలియా 2-1 తేడాతో ఆధిక్యంలో ఉంది. ఈ టెస్ట్ లో గెలిస్తేనే సిరీస్ సమం అవుతుంది. లేకుంటే ఆసీస్ సొంత అవుతుంది. అందుకే ఐదో టెస్ట్ గెలవాలని టీమిండియా పట్టుదలగా ఉంది. చివరి టెస్ట్ లో ఆడే జట్టులో మార్పులు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా రిషబ్ పంత్ పట్ల జట్టు మేనేజ్ మెంట్ కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. రిషబ్ పంత్ స్థానంలో ధృవ్ జురెల్ ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ యువ కీపర్-బ్యాటర్ ఈ సిరీస్ కు ముందు ఆస్ట్రేలియా %ూ%తో జరిగిన మ్యాచ్ లో రాణించాడు. మెల్‌బోర్న్ పిచ్‌పై 80, 68 పరుగులు చేశాడు. ముంబైతో జరిగిన ఇరానీ ట్రోఫీలో రాజస్థాన్ తరపున 93 పరుగులతో జురెల్ ఆకట్టుకున్నాడు. అయితే పెర్త్‌లో జరిగిన తొలి టెస్టుకు జురెల్ 11, 1 పరుగే చేశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 12 పరుగులే చేశాడు. సిడ్నీ టెస్టులో పేలుడు బ్యాటింగ్ కంటే నిలకడ, స్థిరత్వంగా బ్యాటింగ్ చేసేవారికి భారత మేనేజ్‌మెంట్ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. రెడ్-బాల్ క్రికెట్‌లో భారత్ గేమ్-ఛేంజర్‌గా రిషబ్ పంత్ వరుసగా విఫలం అవుతూ వస్తున్నాడు. నాలుగు టెస్టుల్లో, పంత్ 37, 1, 21, 28, 9, 28, 30 పరుగలు చేశాడు. 22 సగటుతో 154 పరుగులు మాత్రమే చేయగలిగాడు. టెస్ట్ క్రికెట్ ను వన్డే క్రికెట్ లా ఆడడం వల్ల పంత్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు నిర్లక్ష్యంగా ఆడి వికెట్ పడేసుకుంటున్నాడు. బాక్సింగ్ డే టెస్ట్ లో మొదటి ఇన్నింగ్స్ పంత్ ఓ షాట్ ఆడి ఔటయ్యాడు. దీనిపై భారత మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్ ఫైర్ అయ్యాడు. అక్కడ ఫిల్డర్ ఉన్నా అటే షాట్ ఎలా ఆడతావని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలోనే తుది జట్టులో పంత్ కు స్థానం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. రిషబ్ పంత్ గత రెండు ఆస్ట్రేలియా పర్యటనల్లో అదరగొట్టిన సంగి తెలిసిందే. కానీ ఈసారి మాత్రం నిరాశ పరుస్తున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఫామ్ లో లేనప్పటికీ అతని స్థానం పదిలంగా ఉండనుంది.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల...

**టాప్-4లో నిలిచిన యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్**

**ఐసీసీ టాప్-10 బ్యాటర్లలో చోటు దక్కిన ఏకైక భారత ఆటగాడిగా నిలిచిన ఓపెనర్**

**కెరీర్ బెస్ట్ 53వ ర్యాంకు సాధించిన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి**

**టాప్-10 భారత బ్యాటర్లలో యువ కెరటానికి చోటు**

**ఏకంగా 40వ స్థానానికి దిగజారిన రోహిత్ శర్మ**

భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అద్భుతంగా రాణిస్తున్న తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. 528 రేటింగ్ పాయింట్లతో 20 స్థానాలు ఎగబాకి 53వ స్థానానికి చేరుకున్నాడు. అరంగేట్ర సిరీస్‌లోనే ఆకట్టుకుంటున్న ఈ యువ ఆల్‌రౌండర్ టాప్-10 భారత బ్యాటర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన నాలుగవ టెస్ట్ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శనతో శతకాన్ని సాధించిన నితీశ్ అందరి ప్రశంసలు అందుకున్నాడు. టీమిండియా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో 8వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి సంచలనం సృష్టించాడు.

**దిగజారిన రోహిత్, కోహ్లీ ర్యాంకులు**

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత అగ్రశ్రేణి క్రికెటర్ల ర్యాంకులు భారీగా దిగజారాయి. ఐసీసీ టాప్-10 ర్యాంకుల్లో భారత్ నుంచి యశస్వి జైస్వాల్ మాత్రమే నిలిచాడు. బాక్సింగ్ డే టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 80 ప్లస్ పరుగులు సాధించిన ఈ యువ ఆటగాడు 4వ స్థానంలో నిలిచాడు. జైస్వాల్, నితీశ్ కుమార్ రెడ్డి మినహా మిగతా బ్యాటర్లు అందరి స్థానాలు భారీగా దిగజారాయి. ఆసీస్ పర్యటనలో 5 ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 31 పరుగులు సాధించిన కెప్టెన్ రోహిత్ శర్మ 40వ ర్యాంక్‌కు పడిపోయాడు. విరాట్ కోహ్లీ మూడు స్థానాలు దిగజారి 24వ స్థానానికి పతనమయ్యాడు. రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ కూడా ఒక్కో స్థానం దిగజారారు.

### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారతీయ బ్యాటర్ల స్థానాలు

**యశస్వి జైస్వాల్ - 4**
**రిషబ్ పంత్ -12**
**శుభ్‌మాన్ గిల్ - 20**
**విరాట్ కోహ్లీ - 24**
**రోహిత్ శర్మ - 40**
**కేఎల్ రాహుల్ - 41**
**రవీంద్ర జడేజా - 50**
**నితీశ్ కుమార్ రెడ్డి - 53**
**శ్రేయాస్ అయ్యర్ - 68**
**అక్షర్ పటేల్ - 69**




# టీమిండియా 9 మంది ఆటగాళ్లతోనే ఆడుతోంది అందుకే ఘోర పరాజయాలు ఎదురువుతున్నాయి

## హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్



ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా దారుణ ప్రదర్శనపై హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీమిండియా 9 మంది ఆటగాళ్లతోనే ఆడుతోందని, అందుకే ఘోర పరాజయాలు ఎదురువుతున్నాయని ఎక్స్‌వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీల పేరు ప్రస్తావించకుండా వారిపై విమర్శలు గుప్పించారు. సీవీ ఆనంద్ మంచి క్రికెటర్ అనే విషయం తెలిసిందే. ఆయన కుమారుడు హైదరాబాద్ జట్టు తరఫున దేశవాళీ క్రికెట్ ఆడుతున్నారు. ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియా దారుణ ప్రదర్శన కనబరుస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యంలో తొలి టెస్ట్ గెలిచిన టీమిండియా.. ఆ తర్వాత రోహిత్ కెప్టెన్సీలో రెండు మ్యాచ్‌ల్లో ఓడి మరో మ్యాచ్ డ్రా చేసుకుంది. దాంతో నాలుగు టెస్ట్‌లు ముగిసే సరికి ఆసీస్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. చివరి టెస్ట్ జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా ప్రారంభం కానుంది. మెల్ బోర్న్ టెస్ట్‌లో టీమిండియాకు ఎదురైన ఘోర పరాజయంపై ఓ నెటిజన్.. హైదరాబాద్ సీపీగా అభిప్రాయం చెప్పాలని కోరాడు. దానికి ఆయన తనదైన శైలిలో బదులిచ్చారు. 'ప్రత్యర్థి జట్టు 11 మందితో ఆడితే టీమిండియా మాత్రం 9 మందితోనే ఆడుతోంది. టాప్ టీమ్స్‌తో చిత్తుగా ఓడుతున్నాం. ఈ విషయాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టం. గత ఆసీస్ పర్యటనలో కుర్రాళ్లతో టీమిండియా విజయం సాధించింది. ఇద్దరు టాప్ ప్లేయర్లు. వారు ఎవరో చెప్పడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారి సోషల్ మీడియా ఆర్మీలు నాపై ట్రోలింగ్‌కు దిగుతాయి. వారు అలా వెళ్లి ఇలా ఔటవుతున్నారు. స్టార్ ఆటగాళ్లు అవసరమైనప్పుడు మంచి ప్రదర్శన చేసి అభిమానుల్లో తమ ఆదరణ తగ్గకుండా ఆడాలి' సీవీ ఆనంద్ బదులిచ్చారు.




# వైశాలికి కాంస్యం

%వరల్డ్ బ్లిట్జ్ చెస్ ఛాంపియన్ షిప్‌లో భారత్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. వైశాలి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైన్‌లో జు జినార్(చైనా)పై 2.5-1.5 తేడాతో గెలుపొందిన అనంతరం సెమీస్‌లో వైశాలి జు వెంజన్(చైనా) చేతిలో 0.5-2.5 తేడాతో పరాజయంపాలైంది. ఆరు రోజుల పాటు ఈ పోటీల్లో ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగంలో భారత్ నుంచి ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, రౌనక్ సాధ్వాని, సందీపవన్ చందా, అరవింద్ చిదంబరం, హర్ష భరతకోటి, ప్రణవ్, దీప్తాయన్ ఘోష్, కార్తీక్ వెంకటరాఘవన్ ఇక మహిళల విభాగంలో కోనేరు హంపి, ద్రోణవల్లి హరిక, వైశాలి, వంతిక అగర్వాల్, సాహితి వర్షిణి, పద్మి రౌత్, దివ్య, నూతక్కి ప్రియాంక హాజరయ్యారు. కాగా, కాంస్యం సాధించిన ఈ యువ గ్రాండ్ మాస్టర్ ఆర్.ప్రజ్ఞానందకు స్వయాన సోదరి.



# షూటింగ్ షురూ..

## ఎస్ఎస్ రాజమౌళి, మహేష్‌బాబు కాంబో భారీ సినిమా



సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో పాన్ వరల్డ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే! ప్రీ ప్రొడక్షన్ వర్క్ జోరుగా సాగుతోంది అయితే. సినిమా సెట్స్ మీదకు ఎప్పుడు వెళుతుంది? అని ప్రేక్షకులంతా ఆతురతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు వాళ్లందరికీ గుడ్‌న్యూస్ అందింది. జనవరి 2వ తేదీ, గురువారం నాడు పూజా కార్యక్రమాలతో మహేష్ బాబు, ఎస్ఎస్ రాజమౌళి సినిమా లాంఛనంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ఉదయం పది గంటలకు ఓపెనింగ్ జరుగుతుంది. మామూలుగా తన సినిమా ప్రారంభోత్సవానికి మహేష్ బాబు హాజరు కారు. మరి ఈ సినిమాకు వస్తాడా లేదా అన్నది చూడాలి. ఈ కార్యక్రమానికి పరిశ్రమలో ప్రముఖులతోపాటు వంద మందికి పైగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. 'ఆర్ఆర్ఆర్' సినిమా చిత్రీకరణలో కొంత భాగం అల్యూమినియం ఫ్యాక్టరీలోనే షూటింగ్ చేశారు. ఆ సమయంలోను రాజమౌళి ఆఫీస్ అక్కడే ఏర్పాటు చేశారు. బాహుబలి కోసం రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ చేసినప్పుడు తన ఆఫీసును అక్కడే ఏర్పాటు చేశారు రాజమౌళి. ఇప్పుడు కూడా అంతే... అల్యూమినియం ఫ్యాక్టరీలో మహేష్ బాబు సినిమా షూటింగ్ కొంత చ్టేసలా ప్లాన్ చేస్తున్నారు. అందుకని ఆఫీస్ అక్కడ ఏర్పాటు చేశారు. సుమారు ఏడాదిగా అక్కడ ఈ సినిమా పనులు చేస్తున్నారని సన్నిహితుల నుంచి సమాచారం. ఈ సినిమా మొదటి షెడ్యూల్ ఆఫ్రికాలో జరగనుంది. కొన్ని రోజుల క్రితం కెన్యాలోని అంబోసెలి నేషనల్ పార్క్ వెళ్లిన రాజమౌళి, లొకేషన్ రెక్కీ నిర్వహించి వచ్చారు. ఆయనతో పాటు తనయుడు ఎస్ఎస్ కార్తికేయ కూడా ఉన్నారు. ఇప్పుడు ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ ఆఫ్రికాలో ప్లాన్ చేస్తున్నారు. కెన్యాతోపాటు సౌత్ ఆఫ్రికాలోని కొన్ని లొకేషన్లలో కూడా

# 6న హరిహర వీరమల్లు పాట రిలీజ్

ప్రాంతీయ భాషా చిత్రాలతోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది కథానాయకులలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన తన సినీ ప్రయాణంలో తొలిసారిగా 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనే పీరియాడికల్ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. జ్యోతి కృష్ణ ఈ భారీ యాక్షన్ ఎపిక్‌ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్ర పాటల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అభిమానులు, ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపే వార్తను తాజాగా నిర్మాతలు పంచుకున్నారు. 'హరి హర వీర మల్లు' నుంచి 'మాట వినాలి' అంటూ సాగే మొదటి గీతాన్ని జనవరి 6వ తేదీన ఉదయం 9:06 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్ ను వదిలారు. తుఫానుకి ముందు ప్రశాంతతలా, యుద్ధానికి ముందు చిరునవ్వు చిందిస్తూ ప్రశాంతంగా కనిపిస్తున్న యోధుడిలా ఉన్న పవన్ కళ్యాణ్ లుక్ పోస్టర్ లో ఆకట్టుకుంటోంది.




# అనుకో కుండా బాధపెడితే సారీ

అవును..
శ్రీలీల సారీ చెప్పింది.
ఒకవేళ ఎవరినైనా
అనుకోకుండా బాధపెట్టినా,
కావాలని ఉద్దేశపూర్వకంగా బాధ
పెట్టినా క్షమించమని అడిగే సమయమిది
అని అంటోంది. నిజమే..! కిస్సిక్.. గాళ్ ఒకే
ఒక్క పాటతో యువతరం గుండెల్లో ముల్లు
గుచ్చింది. మనసుకు గాయం చేసింది. ఈ బాధ కొత్త
సంవత్సరంలోను అలానే ఉంటుంది. అందుకే తెలివిగా ఇలా
ముందే సారీ చెప్పేసింది మరి. 2024 ఎంత మంచి సంవత్సరమో గుర్తు చేసుకుంటూ 2025 కి వెల్
కం చెప్పేసింది. శ్రీలీల తన అభిమానుల కోసం ఇన్‌స్టాలో షేర్ చేసిన విషెస్ సారాంశం ఇలా ఉంది.
ఇది ఎంత మంచి సంవత్సరం!! అంటూ తన ఆనందం వ్యక్తం చేసిన శ్రీలీల.. క్షమించమని చెప్పే
సమయమిదని.. మీరు ఎప్పుడైనా ఎవరినైనా ఉద్దేశపూర్వకంగా లేదా అనుకోకుండా
బాధపెట్టినట్లయితసారీ చెప్పేయమని సూచించింది. 2024లో పుష్ప 2 లో స్పెషల్ సాంగ్
శ్రీలీలకు జాతీయ స్థాయిలో ఇమేజ్ పెంచిందనడంలో సందేహం లేదు. ఈ ఉత్సాహంలో...
కవితాత్మకంగా శ్రీలీల చెప్పిన విషయం ఇలా ఉంది: ప్రజల కృషిని గుర్తించే సమయం.. ఆ
క్షణం మరిచిపోతే.. విశ్వానికి కృతజ్ఞతతో ఉండాల్సిన సమయం ప్రతిదానికీ! దయగా
ఉండాల్సిన సమయం , వైజర్ కూడా స్నానం చేసిన తర్వాత గీజర్‌ని స్విచ్ చేయండి..
వీటన్నింటిని కూడా మన దైనందిన దినచర్యలో భాగంగా చేసుకోవడానికి .. రాబోయే
అందమైన సంవత్సరంలో ప్రజలకు మంచి సంస్కరణను అందించడానికి
నిజాయితీగా ఉండాల్సిన సమయం .. నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. దేవుడు
నాకు పేరు ఇచ్చినందుకు ధన్యవాదాలు ప్రేమ.. ఎప్పుడూ దేన్నీ పెద్దగా
తీసుకోలేదు ఎన్నటికీ కాదు ధన్యవాదాలు 2024?? స్వాగతం
2025?? లవ్ యూ యార్.. అంటూ లవ్ ఈమోజీలను
షేర్ చేసింది.



# కొత్త సంవత్సరంలో అలరించనున్న సినిమాలు ఇవే...




కొత్త సంవత్సరం కొంగొత్త ఆశలు, ఆకాంక్షలతో వచ్చేసింది. అయితే 2024 ఏడాది సినిమా ప్రేక్షకులకు మంచి అనుభవాలను నింపి వెళ్లిన విషయం తెలిసిందే. గుంటూరు కారంతో మొదలైన కొత్త ఏడాది.. ఆ తర్వాత హన్ మాన్, కల్కి, సరిపోదా శనివారం, లక్కీ భాస్కర్, పుష్ప 2 ది రూల్ వంటి సినిమాలతో మర్చిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది. అయితే ఈ ఏడాది కూడా పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలు అలరించబోతున్నాయి. ఈ క్రమంలోనే జనవరిలో బాక్సాఫీసు ముందుకు రానున్న చిత్రాలేవో చూసేద్దాం. ఈ ఏడాది టాలీవుడ్‌లో తెలుగు సినిమా కాకుండా ఒక మలయాళం డబ్బింగ్ చిత్రం బోణీ కొడుతుంది. మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం మార్కో. హనీఫ్ అదేని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. 5 రోజుల్లో రూ.50 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమాను తెలుగులో జనవరి 01న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు మేకర్స్. మలయాళ నటుడు టొవినో థామస్, సౌత్ క్వీన్ త్రిష ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం 'ఐడెంటిటీ'. అఖిల్ పాల్, అనాస్ ఖాన్ ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. ఈ చిత్రం జనవరి 02న ప్రేక్షకుల ముందుకు రానుంది.

గేమ్ ఛేంజర్

ప్రతి సంక్రాంతిలాగే ఈ సంక్రాంతి కూడా రసవత్తరంగా సాగబోతుంది. జనవరి 10న రామ్ చరణ్ గేమ్ ఛేంజర్‌తో మొదలవ్వనున్న ఈ పోటీ తర్వాత వెంకటేశ్, బాలకృష్ణతో పాటు డబ్బింగ్ సినిమాలు రానున్నాయి. రామ్ చరణ్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుడటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.

'డాకు మహారాజ్'

గేమ్ ఛేంజర్ వచ్చిన రెండు రోజులకే బాక్సాఫీస్ మీద దండయాత్ర చేయడానికి 'డాకు మహారాజ్' అంటూ వస్తున్నాడు బాలయ్య. బాలకృష్ణ హీరోగా రూపొందుతున్న ఈ యాక్షన్ డ్రామాలో శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలుగా నటిస్తుండగా.. 'వాల్తేరు వీరయ్య' సినిమాతో 2023 సంక్రాంతికి హిట్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.

సంక్రాంతికి వస్తున్నాం

సంక్రాంతి రేసులో ఉన్న మరో పెద్ద సినిమా సంక్రాంతికి వస్తున్నాం. వెంకటేశ్‌కి ఎఫ్2, ఎఫ్ 3 వంటి సూపర్ హిట్లు అందించిన దర్శకుడు అనిల్ రావిపుడి మరోసారి జతకట్టిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇవే కాకుండా హిందీ నుంచి కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' సినిమాని జనవరి 17న తీసుకురాబోతుండగా.. సోనూసూద్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న 'ఫతేహ్' జనవరి 10న రిలీజ్ కానుంది.




# 'భాగ్యం' పాత్ర భలేగా ఉంటుంది ..

## -ఐశ్వర్య రాజేశ్!

ఐశ్వర్య రాజేశ్ కెరియర్ ను పరిశీలిస్తే, ఈ మధ్య కాలంలో ఆమె తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ కావడం కనిపిస్తుంది. ఓటీటీలోని తమిళ అనువాదాలు ఇక్కడి ప్రేక్షకులను ఆమె అభిమానులుగా మార్చాయి. ఆమె తాజా చిత్రంగా రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈ నెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. తాజాగా 'టీవీ 5'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐశ్వర్య రాజేశ్ మాట్లాడారు. "తెలుగులో నేను చేసిన లాస్ట్ మూవీ 'రిపబ్లిక్'. ఆ సినిమా తరువాత మంచి పాత్రలు రాకపోవడం వలన నేను చేయలేకపోయాను. ఒక రోజున అనిల్ రావిపూడి కాల్ చేసి .. ఈ సినిమా గురించి చెప్పారు. ఆడిషన్ ఇవ్వమని అంటే ఇచ్చాను. ఆ తరువాత నాకు ఆయన కథ చెప్పారు. ఫస్టాఫ్ కథను చెప్పడానికి ఆయన 3 గంటలు తీసుకున్నారు. వింటున్నంత సేపు నేను నవ్వుతూనే ఉన్నాను" అని అన్నారు. " ఈ సినిమా కథ వింటున్న సమయంలో నాకు అసలు సమయమే తెలియలేదు. 'భాగ్యం పాత్రను గురించి తెలుసుకున్నాక తప్పకుండా చేయాలని అనుకున్నాను. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఒక సినిమా నేను చూడలేదు అనుకున్నాను. 'భాగ్యం' పాత్ర దక్కడం నేను చేసుకున్న పుణ్యమని మా అమ్మగారితో చెప్పాను. ఈ పాత్రను నేను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. వెంకటేష్ గారు ఎంతో ప్రోత్సహించారు. ఈ సినిమాలో నా పాత్రకి దక్కే క్రెడిట్ అంతా అనిల్ రావిపూడికే వెళుతుంది" అని చెప్పారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com